సోమవారం
13-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 260
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కొలువుదీరిన చైనా కొత్త కేబినెట్
కేంద్రబ్యాంకు గవర్నర్‌గా గాంగ్ తిరిగి ఎన్నిక

చైనా కొత్త కేబినెట్ కొలువుదీరింది. 14వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) ఐదో ప్లీనరీలో భాగంగా ఆదివారం కొత్త కేబినెట్ సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకారం జరిగింది.

2లో

నేడు ఎమ్మెల్సీ పోరు

- వైసీపీ గెలుపు పాట్లు
- భారీగా బోగస్ ఓట్లు
- 3 పట్టభద్రులు, 2 ఉపాధ్యాయ, 3 స్థానిక సంస్థలకు ఎన్నికలు
- 16న ఫలితాలు
- పోలింగ్‌కు సర్వం సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలో మూడు పట్టభద్రులు, రెండు ఉపాధ్యాయులు, మూడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మూడు స్థానాల్లో పట్టభద్రుల ఓటర్లు మొత్తం-9.8 లక్షలు, రెండు స్థానాలకుగాను మొత్తంగా ఉపాధ్యాయ ఓటర్లు-55 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సామగ్రి, సిబ్బంది ఆదివారం సాయంత్రానికే చేరుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 16వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. ఉపాధ్యాయ స్థానాలు-2(పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమ), పట్టభద్రుల స్థానాలు-3 (పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమ, ఉత్తరాంధ్ర)ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 3 పట్టభద్రుల స్థానాలకు 108 మంది, 2 ఉపాధ్యాయ స్థానాలకు 20 మంది, 3 స్థానిక సంస్థల స్థానాలకు 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మూడు పట్టభద్రుల స్థానాలకు జరిగే ఎన్నికల్లో మొత్తం 10,00,519 ఓటర్లు, రెండు ఉపాధ్యాయ స్థానాల ఎన్నికల్లో 55,842 మంది ఓటర్లు, మూడు స్థానిక సంస్థల నియోజక వర్గాల ఎన్నికల్లో 3,059 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీ ఆది నుంచి గెలుపు కోసం నానాపాట్లు పడుతోంది. అడ్డదారులు

- మిగతా 2 లో

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

2లో

కొంప కొల్లేరు!

మాయమవుతున్న కొల్లేరు సరస్సు

- ఆక్రమణలతో పిల్లకాల్వగా మారుతున్న అతిపెద్ద మంచినీటి సరస్సు
- కబ్జాకోరులు... దగాకోరుల మిలాఖత్
- వేల ఎకరాల చెరువును మింగేసినా... పట్టని అధికారగణం
- పర్యావరణానికి తూట్లు
- గ్రీన్ ట్రిబ్యునల్, కోర్టు తీర్పులు బేఖాతర్

(విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి- విజయవాడ)
కొల్లేరు సరస్సు...ఒకప్పుడు ఇది ఓ అందమైన సరస్సు..ఆహ్లాదకరమైన వాతావరణం..చూడముచ్చటైన ప్రకృతి సోయగాలు..పక్షుల కిలకిలారావాలు...అరుదైన జంతుజాలానికి ఆలవాలమైన అభయారణ్యం...ఇవన్నీ గుర్తుకొస్తాయి. కానీ ఇప్పుడు ఇలాంటి వర్ణనలు, అభివర్ణనలు జరుపుకునే పరిస్థితి లేదిక్కడ. ప్రస్తుతం కొల్లేరు పరిసర ప్రాంతానికి వెళితే...చేపల కంపు, రొయ్యల రోత. చేపల చెరువుల్లో యంత్రాల మోత...ఇవన్నీ విన్పిస్తాయి, కన్పిస్తాయి. బహుశా మరికొన్నాళ్లకు కొల్లేరు మాయమైపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. పర్యావరణం గురించి ఏ మాత్రం పట్టని రాజకీయ నాయకులు, గొప్పగొప్ప చదువులు చదువుకున్నా ఉపయోగం లేని అధికారగణం...ఆసాములూ...భూస్వాములూ..మాఫియాలు... ఇలా అంతా కొల్లేరును కంపుకంపు చేసి, చివరకు 'కొంపకొల్లేరు' చేశారు. అటుఇటుగా దశాబ్దకాలం తర్వాత 'కొల్లేరు' అనేది గత చరిత్ర కాబోతున్నది. కబ్జాలు, ఆక్రమణలు, దందాలు, ప్రశ్నించిన వాడిపై దాడులు పెరిగిపోయాయి. కొల్లేరు సరస్సు అదృశ్యం కాకముందే కళ్లు తెరవాల్సిన సమయం ఆసన్నమైంది. లేనిపక్షంలో...ప్రకృతి పగబడితే మనిషి మట్టిలో కొట్టుకుపోతాడన్న నగ్నసత్యాన్ని తెలుసుకొని... కొల్లేరు ప్రాంతవాసులు అప్రమత్తం కావాల్సిన తరుణమిది.

భారతదేశంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సులలో కొల్లేరు ఒకటి. లక్షకు పైగా ఎకరాలలో వ్యాపించి ఉన్న ఈ సరస్సు ప్రకృతి అందాలకు, అరుదైన వలస పక్షులకు ఆలవాలం. వృక్షజాలం, జంతుజాలంతో సమృద్ధిగా ఉన్న ఈ సరస్సు ఎల్లప్పుడూ అక్టోబర్, మార్చి నెలల మధ్య ఉత్తర ఆసియా, తూర్పు ఐరోపా నుండి వలస పక్షులను ఆకర్షిస్తుంది. ఈ సీజన్లో సరస్సును 186 రకాల జాతుల పక్షులు, 90 రకాల విదేశీ పక్షులు కలుపుకొని దాదాపు 2 మిలియన్ల పక్షులు సందర్శిస్తాయని అటవీశాఖ అధికారులు తెలుపుతున్నారు. సరస్సు మధ్యలో ఎన్నో లంకలు ఉన్నాయి. రకరకాల చేపలకు కొల్లేరు నిలయం. ఉమ్మడి గోదావరి, కృష్ణానదుల డెల్టా ప్రాంతంలో సహజసిద్ధమైన లోతట్టు ప్రాంతంలో ఈ సరస్సు

- మిగతా 2 లో

('దర్జాగా కబ్జా... 5వ కాంటూరు కహానీ' రేపటి సంచికలో)

కాలుష్యం కారణంగా కొల్లేరులో మరణించిన అరుదైన విదేశీ కొంగలు

జగన్ ఆటలు సాగనివ్వం

- దొంగ ఓట్లతో గెలుపునకు కుట్ర
- వైసీపీ ఓటమికి ఏకమైన విపక్షాలు
- పీడీఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్:
ఎమ్మెల్సీ ఎన్నికలు గతానికి భిన్నంగా జరుగుతున్నాయని, సీఎం జగన్ కుట్రలను పసిగట్టి ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చెప్పారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రామకృష్ణ అనంతపురం జిల్లాలో టీడీపీ నేతలను కలిశారు. మాజీమంత్రి పరిటాల సునీత, యువ నాయకుడు పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరితో వేరువేరుగా భేటీ అయ్యారు. అధికార పార్టీ నేతలు తయారు చేసిన దొంగఓట్లు, వెండి బిస్కెట్లు, డబ్బు పంపిణీ వ్యవహారంపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభాకర్ చౌదరి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఎం నాయకులు నల్లప్ప, రాజామోహన్‌తో కలసి రామకృష్ణ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఉండేది కాదని, నాటి ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు ఏనాడూ అభ్యర్థులను పోటీకి దించలేదని రామకృష్ణ గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో వైసీపీ అంతులేని అక్రమాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. తమ అభ్యర్థులను దొంగఓట్లతో గెలిపించుకోవాలని వైసీపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఓటుకు వెయ్యి నుండి ఐదు వేల రూపాయల వరకు పంపిణీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం నుండే దొంగఓట్ల నమోదును సీఎం జగన్ ప్రారంభించారని చెప్పారు. తిరుపతిలో వైసీపీ నాయకులు 15 వేల దొంగఓట్లు చేర్పినట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కేంద్రఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఒక మహిళకు 18 మంది పట్టభద్రులు భర్తలుగా ఉన్నట్లు ఓటరు జాబితాలో నమోదు చేశారని, ఇలాంటి నీచమైన ప్రక్రియకు సీఎం జగన్ దిగజారారని మండిపడ్డారు. ఉత్తరాంధ్రలో వెండి బిస్కెట్లు పంచుతున్నారన్నారు. గెలుపు కోసం ఆరోగ్యకరమైన ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని విమర్శించారు. చట్ట సభల్లో ప్రతిపక్షాలకు ప్రాతినిధ్యం ఉండరాదన్న దుర్బుద్ధితో సీఎం జగన్ పనిచేస్తున్నారని రామకృష్ణ చెప్పారు. రెండు రోజులు వైసీపీ విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేస్తోందన్నారు. జగన్ కుట్రలు, కుతంత్రాలు ఇక సాగవన్నారు. ఈ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, టీడీపీ, జనసేన సహా అన్ని ప్రజా, కర్షక, కార్మిక సంఘాలు

- మిగతా 2 లో

పసుపు ధర పతనం

- తగ్గిన దిగుబడి... గిట్టుబాటు ధర కరువు
- ఆందోళనలో కర్నూలు జిల్లా రైతులు
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులు ప్రతి ఏడాది ఏదొక రూపంలో నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఈ ఏడాది పసుపు ధర పతనం కావడంతో కర్నూలు జిల్లా రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

2లో

నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలి

ఆర్థిక మంత్రి బుగ్గనకు జల్లి విల్సన్, ఓబులేసు వినతి

రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నీటిపారుదల ప్రాజెక్టులకు 15 శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేసింది. మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు మంత్రి బుగ్గన కార్యాలయంలో ఆదివారం ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

2లో

ఇదీ లోకం!

సార్ర్.. ఓటర్లకు ఇవ్వాల్సినవి, మన చోటానాయకుడు ఎత్తుకుపోతున్నాడు!

స్వలింగ పెళ్లిళ్లు సరికాదు

సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ:
స్వలింగ వివాహాలను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 377ను డీక్రిమినలైజ్ చేయడం వల్ల స్వలింగ వివాహాలకు గుర్తింపు ఇవ్వాలని కోరకూడదని స్పష్టంచేసింది. సహజంగా విజాతీయుల మధ్య జరిగే వివాహానికే గుర్తింపు ఉంటుందని, చరిత్ర

- మిగతా 2 లో

బడ్జెట్ సమావేశాలకు ఉమ్మడి వ్యూహం

నేడు ఖర్గే కార్యాలయంలో విపక్షాల భేటీ

న్యూఢిల్లీ:
పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు (రెండో విడత) సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి వ్యూహంతో కేంద్రాన్ని ఇరుకున పెట్టాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. అదానీ వ్యవహారం, అధిక ద్రవ్యోల్బణం, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెంపు, పెరుగుతున్న నిరుద్యోగంతో సహా వివిధ అంశాలపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమయ్యాయి. పార్లమెంటులో అనుసరించే వ్యూహంపై చర్చించేందుకు పార్లమెంట్ కాంపెక్స్‌లోని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు భేటీ కానున్నాయి. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కూడా అదే రోజు సమావేశమై ఉభయ సభల్లో పార్టీ అనుసరించే వ్యూహాన్ని ఖరారు

చేసుకోనుంది. అదానీపై జేపీసీ విచారణ కోసం డిమాండ్ కొనసాగుతోంది. ఈ వివాదంపై ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. కాబట్టి దీనిని పార్లమెంటులో లేవనెత్తుతామని కాంగ్రెస్ ఎంపీ కె.సురేశ్ అన్నారు. ఎల్ఐసీకి సంబంధించిన పెట్టుబడి ప్రభావం వంటి అంశాలు ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతాయన్నారు. వీటిపై తృణమూల్ కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు ఆ పార్టీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ ఇటీవల చెప్పారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలపై కేంద్ర సంస్థల దుర్వినియోగాన్ని కూడా తమ పార్టీ లేవనెత్తుతుందని చెప్పారు. కాగా, ఉద్యోగానికి బదులు భూమి కుంభకోణంలో ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబం కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కొంటున్న క్రమంలో దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై విపక్షాలు దృష్టిని కేంద్రీకరించాయి. వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే ఇప్పటికే ఫెడరల్ వ్యవస్థపై దాడులను ఖండించాయి. వ్యవస్థల దుర్వినియోగాన్ని దుయ్యబట్టాయి. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు మొత్తం 17 సిట్టింగ్‌లలో ఏప్రిల్ 6 వరకు జరగనున్నాయి.రెండో విడత బడ్జెట్ సమావేశాలు దాదాపు నెల తర్వాత జరుగుతున్నందున మంత్రిత్వశాఖలకు కేటాయింపులపై సమీక్షించే అవకాశం వేర్వేరు పార్లమెంటరీ ప్యానళ్లకు లభించింది.

కాంగ్రెస్‌కు కిరణ్‌కుమార్‌రెడ్డి రాజీనామా

విశాలాంధ్ర- అమరావతి:
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు రాజీనామా లేఖ పంపినట్లు కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. బీజేపీలో చేరే యోచనలో కిరణ్ కుమార్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. కిరణ్‌కుమార్‌రెడ్డితో బీజేపీ ముఖ్యనేతలు

- మిగతా 2 లో

కొలువుదీరిన చైనా కొత్త కేబినెట్

కేంద్రబ్యాంకు గవర్నర్‌గా గాంగ్ తిరిగి ఎన్నిక

విదేశాంగ మంత్రికి కౌన్సిలర్ పదవి

బీజింగ్: చైనా కొత్త కేబినెట్ కొలువుదీరింది. 14వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) ఐదో ప్లీనరీలో భాగంగా ఆదివారం కొత్త కేబినెట్ సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకారం జరిగింది. ప్రధానిగా లీ క్యాంగ్‌తో పాటు ఉప ప్రధానులు, కౌన్సిలర్లు, మంత్రులు, కేంద్ర బ్యాంకు గవర్నర్, ఆడిటర్ జనరల్, కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి వంటి ముఖ్యులను సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జిన్‌పింగ్ ఆయా అధికారుల నియామక పత్రాలపై సంతకాలు చేశారు. 14వ ఎన్‌పీసీకి సంబంధించి ఎనిమిది ప్రత్యేక కమిటీల చైర్‌పర్సన్‌లు, వైస్ చైర్‌పర్సన్‌లు, సభ్యులనూ ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. చైనా కేంద్ర బ్యాంకు గవర్నర్‌గా యీ గాంగ్ ఆదివారం తిరిగి నియమితులయ్యారు. పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా గవర్నర్‌గా ద్రవ్య విధానాల రూపకల్పన, అమలులో ఈయనది కీలకపాత్ర. కాగా, కొత్త అధికారులు, మంత్రులు అంతా చైనా రాజ్యాంగానికి కట్టుబడి పనిచేస్తామంటూ ప్రతిజ్ఞచేశారు. తమ పదవీ బాధ్యతలను చేపట్టారు. ఇదిలావుంటే చైనా విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌ను స్టేట్ కౌన్సిలర్‌గా పదోన్నతి కల్పించారు. క్విన్(56) డిసెంబరులో విదేశాంగ మంత్రిగా నియమితులయ్యారు. భారత్, చైనా సరిహద్దు చర్చల్లో కీలకంగా వ్యవహరించారు. ఈ క్రమంలో ఆయనకు 2003లో ఏర్పాటైన భారత చూనా సరిహద్దు యాంత్రాంగానికి ప్రత్యేక ప్రతినిధి (ఎస్ఆర్)గా నియమితులయ్యేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. అదే విధంగా రక్షణ మంత్రి లి షాంగ్‌ఫూనూ కౌన్సిలర్‌గా పదోన్నతి కల్పించారు. ప్రజా భద్రతా శాఖ మంత్రి వాంగ్ జియాహోంగ్, చైనా కేబినెట్ ప్రధాన కార్యదర్శి వు జెలాంగ్‌నూ కౌన్సిలర్ పదవి వరించింది. అత్యున్నత స్థాయిలో ఏకైక మహిళా మంత్రి షెన్ ఇక్విన్ ఎన్నికయ్యారు. 24 మందితో కూడిన పొలిట్‌బ్యూరోలో, 200 మందికిపైగా సభ్యులుగల చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో 95శాతం మంది పురుషులున్నారు.

నేడు నేపాల్ అధ్యక్షుడిగా పౌడెల్ ప్రమాణం

ఖాట్మండు: నేపాల్ నూతన అధ్యక్షుడిగా రామ్ చంద్ర పౌడెల్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నేపాల్ ఆపద్ధర్మ ప్రధాన న్యాయమూర్తి ఆయనతో ప్రమాణం చేయిస్తారు. గురువారం జరిగిన ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్ సీనియర్ నేత పౌడెల్ ఘన విజయం సాధించారు. ఎనిమిది పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగి 214 మంది పార్లమెంటు సభ్యులు, 352 మంది అసెంబ్లీ సభ్యుల ఓట్లను పొందారు. 2008 నుంచి నేపాల్‌లో మూడుసార్లు అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. కాగా, ప్రస్తుత అధ్యక్షురాలు బిద్యాదేవి భండారి పదవీ కాలం ఆదివారంతో ముగిసింది.

పింఛన్ సంస్కరణల బిల్లుకు ఫ్రెంచ్ సెనేట్ ఆమోదం

పారిస్: పింఛన్ సంస్కరణలను మాక్రాన్ ప్రభుత్వం ప్రతిపాదించినప్పటి నుంచి ఫ్రాన్స్ నిరసనలతో అట్టుడికిపోతోంది. అయితే ప్రభుత్వం మాత్రం ఈ బిల్లు విషయంలో వెనక్కి తగ్గలేదు. చివరకు ఫ్రెంచ్ సెనేట్ ఆమోద ముద్ర లభించింది. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టగా ఎగువ సభలో 195 ఓట్లు లభించాయి. 'కొన్ని వందల గంటలు చర్చించిన తర్వాతే సెనేట్ పింఛన్ సంస్కరణ బిల్లును ఆమోదించినట్లు ప్రధాని ప్రధాని ఎలిజబెత్ బార్నె వెల్లడించారు. ఇది నిర్ణయాత్మక ముందడగని, తద్వార ఫించన్ వ్యవస్థ భవిష్యత్‌కు హామీ లభించిందని ఆమె ట్వీట్ చేశారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో శనివారం జరిగిన ప్రదర్శనలో 3,68,000 మంది పాల్గొన్నారు. ఫలితంగా రైల్వే-రోడ్డు రవాణాకు తీవ్ర అంతరాయం కలిగినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

భువికి తిరిగొచ్చిన నాసా వ్యోమగాములు

లాస్‌ఏంజిల్స్: నాసా స్పేస్ ఎక్స్ క్రూ-5 వ్యోమగాములు క్షేమంగా భూమ్మీదకొచ్చారు. స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక అమెరికాలోని ఫ్లోరిడాలో సురక్షితంగా దిగినట్లు నాసా ప్రకటించింది. నలుగురు అంతర్జాతీయ స్థాయి వ్యోమగాములలో నాసాకు చెందిన జోష్ కస్సాడా, నికోల్ మాన్, జపాన్ ఏయిరోస్పేస్ అన్వేషణ సంస్థ నుంచి కొచ్చి వకట, రోస్కోస్మోస్ కాస్మోనాట్ అన్నా కికినా ఉన్నారని వెల్లడించింది. వ్యోమగాములంతా పారాచ్యుట్‌ల సాయంతో ఫ్లోరిడాలో శనివారం రాత్రి 9.2 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) గల్ఫ్ ఆఫ్ మెక్సికో దిగినట్లు నాసా ప్రకటన పేర్కొంది. గతేడాది అక్టోబరు 5వ తేదీన ఫ్లోరిడాలోని నాసా కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ మిషన్‌ను చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఉదయం 8 గం. నుంచి పోలింగ్

పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్‌ల నియామకం

ఐదుగురు వైసీపీ అభ్యర్థుల ఏకగ్రీవం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో మూడు పట్టభద్రులు, రెండు ఉపాధ్యాయ, మూడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను ఈనెల 13వ తేదీ సోమవారం ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా వెల్లడించారు. ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. అన్ని నియోజక వర్గాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఎన్నికల పరిశీలకులుగా నియమించినట్లు ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. ఆదివారం వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం నాల్గవ బ్లాక్ లోని పబ్లిసిటీ సెల్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మొత్తం ఎనిమిది ఎమ్మెల్సీ స్థానాలకు జరగబోయే ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని వివరించారు. శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప-అనంతపూర్-కర్నూలు మూడు పట్టభద్రుల నియోజక వర్గ స్థానాలకు, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప-అనంతపూర్-కర్నూలు రెండు ఉపాధ్యాయ నియోజక వర్గ స్థానాలకు, శ్రీకాకుళం-పశ్చిమ గోదావరి-కర్నూలు స్థానిక సంస్థల నియోజక వర్గ స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతపురం, కడప, నెల్లూరు, తూర్పు గోదావరి, చిత్తూరు స్థానిక సంస్థల నియోజక వర్గ స్థానాలకు వైసీపీ అభ్యర్థులు మినహా ఎవరూ పోటీ చేయకపోవడం వల్ల అక్కడ వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించామన్నారు. అనంతపురం స్థానిక సంస్థల నియోజక వర్గానికి ఎస్.మంగమ్మ, కడప స్థానిక సంస్థల నియోజక వర్గానికి రామ సుబ్బారెడ్డి పొన్నపురెడ్డి, నెల్లూరు నియోజకవర్గానికి మేరుగ మురళీధర్, తూర్పు గోదావరి నియోజక వర్గానికి కుడిపూడి సూర్యనారాయణరావు, చిత్తూరు స్థానిక సంస్థల నియోజక వర్గానికి సుబ్రహ్మణ్యం సిపాయి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు వెల్లడించారు. ఎన్నికలను కట్టుదిట్ట పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎన్నికల ప్రక్రియను లైవ్ వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ద్వారా నిశితంగా పర్యవేక్షిస్తున్నాని స్పష్టంచేశారు. 16వ తేదీ గురువారం ఉదయం 8.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు.

స్వలింగ పెళ్లిళ్లు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం చూసినా ఇదే ప్రమాణం కనిపిస్తుందని పేర్కొంది. రాజ్యం మనుగడకు ఇది పునాది అని తెలిపింది. స్వలింగ పెళ్లిళ్లకు చట్టపరమైన గుర్తింపు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. విజాతీయుల మధ్య పెళ్లికి ఉన్న సామాజిక విలువలను పరిగణనలోకి తీసుకుని, ఇతర రూపాల్లోని వివాహాలు, యూనియన్లను వదిలిపెడుతూ, విజాతీయుల మధ్య జరిగే వివాహాలకు మాత్రమే గుర్తింపునివ్వడం రాజ్యానికి తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. సమాజంలోని వ్యక్తుల మధ్య సంబంధాల విషయంలో వ్యక్తిగత అవగాహనలు రకరకాలుగా ఉండవచ్చునని, పెళ్లిళ్లు, కలయికలు వంటివి వేర్వేరు రూపాల్లో ఉండవచ్చునని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో హెటిరోసెక్సువల్ (స్త్రీ, పురుషుల మధ్య) వివాహానికి మాత్రమే గుర్తింపును పరిమితం చేస్తున్నట్లు తెలిపింది. సమాజంలో కుటుంబ వ్యవస్థ ఉందని, దీనిలో చిన్నచిన్న కుటుంబాలు ఉన్నాయని, సమాజం అనే భవన నిర్మాణానికి ఇవి ఇటుకల వంటివని తెలిపింది. కుటుంబాలు కొనసాగాలని తెలిపింది. సేమ్ సెక్స్ మ్యారేజ్‌కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరపబోతోంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరుపుతుందని సుప్రీంకోర్టు కాజ్ లిస్ట్ వెల్లడించింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పర్దీవాలా సభ్యులుగా ఉన్నారు. స్త్రీని మరొక స్త్రీ పెళ్లి చేసుకున్నప్పుడు, పురుషుడు మరొక పురుషుడిని వివాహం చేసుకున్నప్పుడు ఆ వివాహానికి చట్టపరమైన చెల్లుబాటు కల్పించాలని కోరుతూ దిల్లీ హైకోర్టు సహా వివిధ హైకోర్టులలో దాఖలైన పిటిషన్లను కలిపి, సుప్రీంకోర్టు జనవరి 6న తనకు బదిలీ చేసుకుంది. ఇష్టపూర్వక గే సెక్స్ నేరం కాదని 2018లో తీర్పు చెప్పిన రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ డీవై చంద్రచూడ్ కూడా ఉన్నారు. ఐపీసీ సెక్షన్ 377 హేతుబద్ధమైనది కాదని, సమర్థనీయం కాదని, నిరంకుశమైనదని ఈ తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది.

కాంగ్రెస్‌కు కిరణ్‌కుమార్‌రెడ్డి రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చిట్టచివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి త్వరలోనే బీజేపీ తీర్థం పుచ్చుకుంటారంటూ రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి గతంలోనూ ఇలాంటి చర్చే జరిగినా... ఆయన కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. అయితే ఇటీవల కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ చేపట్టిన జోడో యాత్రకు నల్లారి దూరంగా ఉన్నారు. బీజేపీలో చేరేందుకు కిరణ్‌కుమార్‌రెడ్డి మానసికంగా సిద్ధమైనట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర విభజనను గట్టిగా వ్యతిరేకించిన ఆయన.. విభజన తర్వాత 'జై సమైక్యాంధ్ర' పేరుతో సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. 2014 ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీకి నిలబెట్టారు. అయితే ఎవరూ గెలవలేదు. దీంతో సుదీర్ఘకాలం రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. తర్వాత మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. ఏపీసీసీ సమన్వయకమిటీ సభ్యునిగా వ్యవహరించారు. ఇదిలావుంటే, రెండు నెలలుగా బీజేపీ అగ్రనేతలు నల్లారితో సంప్రదింపులు చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ తెలంగాణ శాఖలో చేరాలని ఆ పార్టీ కేంద్ర నాయకత్వం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రిగా పార్టీలో గౌరవప్రద స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు నల్లారి సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఈ సంప్రదింపుల ప్రక్రియ కొలిక్కి వస్తోందని...త్వరలోనే బీజేపీ అగ్రనేతలను కలిసి కిరణ్‌కుమార్ రెడ్డి కాషాయం కండువా కప్పుకొంటారని భావిస్తున్నారు.

నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నీటిపారుదల ప్రాజెక్టులకు 15 శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేసింది. మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు మంత్రి బుగ్గన కార్యాలయంలో ఆదివారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై సమగ్రంగా చర్చించి, వాటి పరిస్థితుల గురించి మంత్రికి జల్లి విల్సన్, ఓబులేసు వివరించారు. సీపీఐ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి నిర్ణయం మేరకు పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం రాష్ట్రంలో నిర్మాణంలోను, ఆమోదించిన, పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను ఫిబ్రవరి 13 నుంచి 23 వరకు పరిశీలించిందని గుర్తుచేశారు. విజయవాడ దాసరిభవన్‌లో ఈనెల 5వ తేదీన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి...అందులో చేసిన తీర్మానాలను మంత్రికి వివరించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున దాని నిర్మాణ బాధ్యత, నిర్వాసితుల పరిహారం సవరించిన అంచనా ప్రకారం కేంద్రం ఇవ్వాలని, అందుకోసం ఒత్తిడి పెంచడానికి కేంద్ర ప్రభుత్వం వద్దకు అఖిలపక్షాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లాలని మంత్రి బుగ్గనకు విజ్ఞప్తి చేశారు. పోలవరం ఎత్తు తగ్గించకుండా ప్రతిపాదిత ఎత్తుతో నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారాన్ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించి ప్రాజెక్టులకు ఖర్చు చేయాలని, గత ప్రభుత్వాల హయాంలో 15 శాతం, 17 శాతం నిధులు ప్రాజెక్టులకు కేటాయించారని జల్లి విల్సన్, ఓబులేసు గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం గతేడాది 5 శాతమే నిధులు వెచ్చించిందని, ఈ విడత 15 శాతం కేటాయించడం వల్ల ప్రాజెక్టులు 80 శాతం పూర్తి కావడానికి అవకాశముంటుందని తెలిపారు. మిగిలిన అంశాలపైనా ఆర్థికమంత్రితో సమగ్రంగా చర్చించగా, దానిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఇంకా రెండు రోజులే సమయం ఉందని, ఇప్పటికే దాదాపు బడ్జెట్ తయారైందని, అవకాశమున్న మేరకు సర్దుబాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

బడ్జెట్ కేటాయింపులతో సంబంధం లేకుండానే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీఆర్ గతంలో ప్రాజెక్టులకు అధిక మొత్తాన్ని విడుదల చేసి ఖర్చు చేసిన సంఘటనలున్నాయని నాయకులు గుర్తుచేశారు. 'మీరు కూడా కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాల నుంచి ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారు. నీటి విలువ, ప్రాధాన్యత గురించి మీకు బాగా తెలుసు. అందువల్ల నీటి ప్రాజెక్టులపై తక్షణమే దృష్టి సారించండి. నిర్ణీత కాలవ్యవధిలో నీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోండి' అని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎగువభద్ర నిర్మాణం వల్ల టీబీ డ్యామ్ ద్వారా హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, కేసీ కెనాల్‌కు జరిగే నష్టాన్ని నివారించడానికి కేంద్రం వద్ద సమర్థవంతమైన వాదనలు వినిపించి దాన్ని ఆపు చేయాలని సూచించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని, వంశధార, నాగావళి నదులపై ఉన్న రిజర్వాయర్లను ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేయాలని కోరారు. వాటితోపాటు గాలేరు-నగరి సుజల స్రవంతి, తెలుగుగంగ, హంద్రీ-నీవా సుజల స్రవంతి, వెలిగొండ, గుండ్రేవుల, వేదవతి, రాజోలిబండ, సిద్దేశ్వరం అలుగు ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం మొదటి, రెండు దశలతో ఉత్పన్నమైన వివిధ భూ సేకరణ సమస్యలు పరిష్కరించాలని, కాల్వల నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని కోరారు.

పసుపు ధర పతనం

విశాలాంధ్ర-చాగలమర్రి : ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులు ప్రతి ఏడాది ఏదొక రూపంలో నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఈ ఏడాది పసుపు ధర పతనం కావడంతో కర్నూలు జిల్లా రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పండిన పంటకు సరైన ధర లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని అంటున్నారు. గత నెలలో పసుపు క్వింటా రూ.5 నుంచి 6 వేలకు పైగా పలికింది. ఇప్పుడిప్పుడే పంట మార్కెట్‌కు చేరుతోంది. అధిక వర్షాలకు పంట నాణ్యత లేకపోవడం, దిగుబడి గణనీయంగా తగ్గిపోవడం రైతులను మరింత కష్టాల్లోకి నెట్టింది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం కూడా ధర పతనానికి మరో కారణమంటూ వ్యాపారులు ధరల్లో కోత పెడుతున్నారు. ప్రస్తుతం వట్టి పసుపు ధర రూ.4,500 నుంచి రూ.5,200 లోపు మాత్రమే పలుకుతోంది. పచ్చి పసుపు 300 కిలోలు రూ.2,100 పలుకుతోంది. గత ఏడాది రూ.3,500 ధర పలికింది. పండిన పంటను మార్కెట్‌కు తరలిస్తే గిట్టుబాటు ధర లేక రైతులు కన్నీరు పెడుతున్నారు. నాలుగేళ్ల నుంచి పసుపు ధర పెరగకపోవడంతో రైతులు పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పుల పాలవుతున్నారు. ఈ ఏడాది మండలంలో 800 ఎకరాల దాకా పసుపు పంటను సాగు చేశారు. ఒక్క చిన్నవంగలి గ్రామంలోనే 500 ఎకరాల వరకు సాగు చేశారు. ఎకరాకు రూ.లక్ష ఖర్చు అవుతోంది. దిగుబడి 30 నుంచి 40 క్వింటాళ్లు రావాల్సి ఉంది. అయితే 15 నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వచ్చిన పసుపును అమ్ముకునేందుకు ధర లేకపోవడంతో పొలాల్లోనే కుప్పలుగా ఉంచారు. మరికొందరు పసుపు ఉడికించి ఆరబెడుతున్నారు. క్వింటాకు కనీసం రూ.8 వేలు ఉంటే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా గిట్టుబాటు ధర కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అప్పులే మిగిలాయి : సంజీవరెడ్డి, రైతు, చిన్నవంగలి

మూడు ఎకరాల పొలంలో పసుపు పంట సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. ఆశించిన మేర దిగుబడి రాలేదు. గిట్టుబాటు ధర లేక పోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కొన్నేళ్లుగా పసుపు ధర లేకపోవడంతో నష్టపోతున్నాం. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలి. లేకుంటే అప్పుల పాలవుతాం.

గిట్టుబాటు ధర కల్పించాలి : నాగార్జున, కౌలు రైతు, చిన్నవంగలి

రెండెకరాల్లో పసుపు పంటను కౌలుకు తీసుకొని సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. 10 క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. వచ్చిన పసుపును అమ్ముకునేందుకు ధర లేక నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

నేడు ఎమ్మెల్సీ పోరు

(మొదటిపేజీ తరువాయి)

తొక్కుతోంది. విచ్చలవిడిగా బోగస్ ఓట్లు చేర్చి, అధికారులను ప్రయోగిస్తూ గెలుపే లక్ష్యంగా మితిమీరి ప్రవర్తిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. బోగస్ ఓట్లు, అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ అధినేత చంద్రబాబు ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలతో చాలాచోట్ల ఎన్నికల అధికారులు కుమ్మక్కయ్యారంటూ విమర్శించారు. ఇదే అంశంపై రాష్ట్ర ఎన్నికల అధికారికి సీపీఐ, సీపీఎం, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. తిరుపతిలోని 44వ డివిజన్ చికెన్ దుకాణం చిరునామాతో 16 బోగస్ ఓట్లు నమోదు చేసిన ఉదంతం చర్చనీయాంశంగా మారింది. చాలాచోట్లా ఇదే తరహాగా బోగస్ ఓట్లు నమోదయ్యాయి. ఈ బోగస్ ఓట్లపై విచారించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు, ఏపీ ఎన్నికల అధికారికి ప్రతిపక్ష పార్టీలు, బరిలో ఉన్న ఉపాధ్యాయ, పట్టభద్రుల అభ్యర్థులు ఫిర్యాదు చేసినప్పటికీ...ఎలాంటి స్పందన లేదు. దీంతో అధికారులు సైతం వైసీపీ అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ఎన్నికల చివరి వరకు వైసీపీ ప్రలోభాలకు పాల్పడుతోంది. తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఓటర్లకు డబ్బు, గిఫ్టులు, ఆభరణాలను పంపిణీ చేసింది. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం కోసం వైసీపీ ఏకంగా రాష్ట్రస్థాయి అధికారిని నియమించింది. ఎస్ఈఆర్‌సీ డైరెక్టరుగా ఉన్న ప్రతాప్‌రెడ్డిని...కడప ఆర్జేడీ(పాఠశాల విద్య)కి బదిలీ చేయించి, ఆయన ద్వారా ఉపాధ్యాయులతో సభలు, సమావేశాలు నిర్వహించి బహిరంగంగా వైసీపీ అభ్యర్థికి ఓట్లు అడిగింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలోనూ వైసీపీ ఆగడాలు మితిమీరాయి. అక్కడ ఆంధ్రా విశ్వవిద్యాలయ వీసీ ప్రసాద్‌రెడ్డిని రంగంలోకి దించింది. ఆయన ఏకంగా వైసీపీ సీనియర్ నేతలు వైవీ సుబ్బారెడ్డి తదితరులు నిర్వహించిన పార్టీ సమావేశానికి హాజరై, వైసీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలంటూ ప్రకటించారు. వీసీ వైఖరిపై విద్యార్థి, యువజన సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి ఆయన కనుమరుగైన సంఘటనలున్నాయి. ఆయా సంఘటనలపై రాష్ట్ర ఎన్నికల అధికారికి, గవర్నరుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న, ప్రతిపక్ష పార్టీల నేతలు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదు.

ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలి: చంద్రబాబు

వైసీపీ నేతలతో ఎన్నికల అధికారులు కుమ్మక్కయ్యారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ అధినేత చంద్రబాబు ఫిర్యాదు చేశారు. బోగస్, నకిలీ ఓట్లు చేర్చడం వల్ల ఎన్నికల ప్రక్రియ అపహాస్యమవుతోందన్నారు. గత తిరుపతి పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా బోగస్ ఓట్లు నమోదయ్యాయని, ప్రస్తుత పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే పునరావృతమైందని తెలిపారు. కొందరు ఎన్నికల అధికారులు నకిలీ పత్రాలను పరిశీలించకుండానే ఆమోదించారన్నారు.

వైసీపీ అధికార దుర్వినియోగం: సీపీఎం

ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ పెద్దఎత్తున చట్టవిరుద్ధ, అక్రమ పద్ధతులకు పాల్పడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఆదివారం ఆయన ఫిర్యాదు చేశారు. తిరుపతి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనేక నకిలీ ఓట్లు ఉన్నట్లుగా గతంలోనే లేఖలు రాశామని గుర్తుచేశారు. అయినా ఇప్పటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయని, ఈ ఓట్లు వేయించడానికి ఓటర్లు కాని వారిని డబ్బులిచ్చి పోలింగ్‌కు సిద్ధం చేస్తున్నారన్నారు. తక్షణం దీనిని అరికట్టేందుకు ఎన్నికల యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, పోలింగు రోజున గట్టి నిఘా పెట్టాలని కోరారు. వాటికి సంబంధించిన ఆధారాలను ఆయన పంపారు.

కొంప కొల్లేరు!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడింది. ఇది ప్రకృతిప్రసాదం. కాలానుగుణంగా వచ్చే బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు నుండే కాక డెల్టా ప్రాంతం నుండి వచ్చే అనేక కాలువల ద్వారా నీరు వచ్చి చేరుతుంది. 67కి పైగా పెద్ద, చిన్న నీటిపారుదల కాలువల ద్వారా కృష్ణా, గోదావరి నీటిపారుదల వ్యవస్థలకు ఇది అనుసంధానమై ఉంది. కొల్లేరు నుండి నీరు ఉప్పుటేరు (62 కిలోమీటర్ల పొడవు ఉన్న ఒకే ఒక వాగు) ద్వారా బయటకు వెళుతుంది. సరస్సుకు ఆగ్నేయాన ఉన్న ఈ వాగు ద్వారా నీరు బంగాళాఖాతానికి చేరుతుంది. కొల్లేటి సరస్సు 250 నుండి 340 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సరాసరి లోతు 0.5 నుండి రెండు మీటర్ల దాకా ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు, నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు, పెదపాడు, ఏలూరు, దెందులూరు మండలాలలో సరస్సు లోపల 20 గ్రామాలు, సరస్సును ఆనుకొని 63 గ్రామాలు, ఉమ్మడి కృష్ణా, ప్రస్తుతం ఏలూరు జిల్లా కైకలూరు, మండవల్లి మండలాల పరిధిలో సరస్సు లోపల 26, సరస్సును ఆనుకుని 13 గ్రామాలు కొల్లేరు పరిధిలో విస్తరించి ఉన్నాయి. కొల్లేరు పక్షుల సంరక్షణ కేంద్రం ఇక్కడ ఉంది. భారత వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం వన్యప్రాణుల అభయారణ్యంగా దీన్ని 1999లో ప్రకటించారు. 2002లో అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన చిత్తడి నేలగా గుర్తించారు. ఇక వన్యప్రాణుల అభయారణ్యం 308 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. కొల్లేరు..కొల్లేరులా ఉంటే నిజంగానే అదొక అద్భుత దృశ్యం.

మరి నేడు!

ప్రస్తుతం కొల్లేరు సరస్సు పరిస్థితి పూర్తి భిన్నం. వేల ఎకరాలలో చేపలు, రొయ్య చెరువులు తవ్వి సరస్సును కేవలం కాలువగా మార్చేశారు. ఇది కాలుష్యపరంగా తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఫలితంగా, స్థానిక ప్రజల తాగునీటి ఇబ్బందులు పెరిగాయి. పర్యావరణ వైవిధ్యాన్ని కోల్పోవడం, సముద్రపు నీరు కొల్లేరు ప్రాంత భూభాగంలోకి చొచ్చుకుపోవడం, ఈ ప్రాంతంలో వర్షపాతం నమూనాపై ప్రతికూల ప్రభావం చూపడం వంటి పరిణామాలు తలెత్తాయి. వర్షపాత శాతం పతనమైంది. ఈ అసమతుల్యత అభయారణ్య ఎగువ ప్రాంతంలోని వేలాది ఎకరాల పంటలపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. అక్రమంగా కనిపించిన చేపల, రొయ్యల చెరువుల వలన అనేక జీవాలు రోగాల బారినపడి మరణిస్తున్నాయి. చెరువులు తవ్వగా మిగిలిన సరస్సు నీటిమళ్లింపుతో కుంచించుకుపోయింది. ఆ కాస్త మిగిలివున్న సరస్సు కూడా ఏనుగు గడ్డి, కలుపు మొక్కలతో నిండిపోయింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు సరస్సు ప్రస్తుతం అటుఇటుగా ఎడారిని తలపిస్తోంది. మండుతున్న ఎండలకు నీరు ఆవిరి అవుతుండడంతో జంతువులు, చేపలు మృత్యువాత పడుతున్నాయి. కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం బోసిపోతున్నది. 286 ఎకరాలలో నీరు లేక విదేశీ పక్షులు చనిపోతున్నాయి. అక్రమ చేపల చెరువుల తవ్వకాల ఫలితమే ఇదంతా! ఆక్రమణదారులను అడిగేవాడు లేడు. వేల ఎకరాల చెరువును మింగేసినా... అధికారులకు పట్టదు. కబ్జాకోరులు, రాజకీయ దగాకోరులు మిలాఖత్ కావడంతో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అంతా కలిసి పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నారు. విచిత్రమేమిటంటే గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టు కొల్లేరు పరిరక్షణకు అనుకూలంగా తీర్పులిచ్చినా అధికారులు బేఖాతర్ చేయడం... స్థానికులు జీర్ణించుకోలేని విషయంగా మారింది. చేపల చెరువులను ధ్వంసం చేయాలన్న తీర్పులు బుట్టదాఖలయ్యాయి.

జగన్ ఆటలు సాగనివ్వం

(మొదటిపేజీ తరువాయి)

ఏకతాటిపైకి వచ్చాయని, దొంగఓట్లను అడ్డుకోవటం కోసం సర్వశక్తులు ఒడ్డుతామని స్పష్టం చేశారు. వైసీపీ అభ్యర్థులను ఓడించాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ శ్రేణులకు పిలుపునిచ్చారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రెండవ ప్రాధాన్యత ఓటును టీడీపీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డికి వేయాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. వైసీపీ అభ్యర్థులను గెలిస్తే ఎవరికి వారు తమ మెడలకు ఉరితాళ్లు బిగించుకున్నట్లేనని ఉపాధ్యాయులు, పట్టభద్రులకు సూచించారు. దొంగ ఓటర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీఐ, టీడీపీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను సీఎం జగన్ సర్వనాశనం చేశారని మండిపడ్డారు. 60 రూపాయలకు అమ్మాల్సిన మద్యం రూ.160కి, రెండు వేల రూపాయల ఇసుక ట్రాక్టర్‌ను రూ.6 వేలకు, లారీ ఇసుక 40 వేల రూపాయలకు విక్రయిస్తూ జగన్ వేలకోట్ల రూపాయలు సంపాదించారని విమర్శించారు. జగన్ తన అక్రమార్జనతో ఓట్లు కొనుగోలు చేస్తున్నారన్నారు. విజ్ఞతతో ఆలోచించి...ప్రతిపక్ష అభ్యర్థులకు ఓటు వేయాలని డాక్టర్లు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పట్టభద్రులకు రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ జగన్ ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ ఓ నియంతలా పాలన చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పీడీఎఫ్ అభ్యర్థికి రెండవ ప్రాధాన్యత ఓటు వేయాలని నిర్ణయించామన్నారు. వైసీపీ ఓటమికి తామంతా కృషి చేస్తామన్నారు.

బీహార్‌లో రెండు ఆలయాలకు నిప్పు

పాట్నా : బీహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాలో రెండు ఆలయాలకు గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో భజరంగ్‌బలి ఆలయం పాక్షికంగా దెబ్బతిన్నది. దుర్గా ఆలయం పూర్తిగా దగ్ధమైంది. ఆలయాల మధ్య బజరంగ్ అనే వ్యక్తికి చెందిన షాపు, భజరంగ్‌బలి ఆలయ పూజారి మదన్ లాల్ ఇల్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనకు నిరసనగా స్థానికులు ఆందోళనకు దిగారు. వీధుల్లోకొచ్చి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆలయాలను దగ్ధం చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు అక్కడకు చేరుకొని ఆందోళనకారులను శాంతింపచేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరింపచేశారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలకు భగ్నం కలిగించాలనే దుండగులు ఆలయాల ధ్వంసానికి పూనుకున్నారని స్థానికులు ఆరోపించారు. దీనిపై సిట్ విచారణకు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- భారీ పోలీసు బందోబస్తు

విశాలాంధ్ర బ్యూరో-కడప: కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు సంబంధించి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం ఉదయం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని పోలీసు బందోబస్తు మధ్య తరలించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులకు సంబంధించి జిల్లాలో 131 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 131 మంది పీఓలు, 131 మంది ఏపీఓలు సహా మొత్తం 499 మంది పోలింగ్ సిబ్బంది, 131 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. రిజర్వులో 49 మంది పీఓలు, 51 మంది ఏపీఓలు, 135 మంది ఓపీఓలు మొత్తం 235 మంది పోలింగ్ సిబ్బంది కాగా, 22 మంది సూక్ష్మ పరిశీలకులను రిజర్వులో ఉంచినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు.

మొత్తం ఓట్ల వివరాలు

కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మొత్తం 2,09,800 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా, 1,41,400 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. కడప జిల్లాలో పట్టభద్రుల ఓట్లు 81,317, ఉపాధ్యాయుల ఓట్లు 7,461 ఉన్నాయి. జిల్లాలో 131 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. కాగా, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానానికి అధికార వైసీపీ తరపున అనంతపురం జిల్లాకు చెందిన తాజా ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి కుమారుడు వెన్నపూస రవీంద్రనాథ్ రెడ్డి, టీడీపీ తరపున పులివెందులకు చెందిన భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు మద్దతు ఇస్తున్నాయి. ఇండిపెండెంట్లుగా పట్టు పోగుల పవన్‌కుమార్‌తో పాటు అనేకమంది పోటీ చేస్తున్నారు. పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మొట్టమొదటిసారిగా వైసీపీ పోటీ చేస్తోంది. వైసీపీ నుండి కడపకు చెందిన విద్యాసంస్థల అధినేత ఎంవీ రామచంద్రా రెడ్డి పోటీ చేస్తుండగా టీడీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయకుండా లెఫ్ట్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తోంది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పాటు పీడీఎఫ్. ఎస్‌టీయూ. యూటీఎఫ్ మద్దతుతో తాజా ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో పాటు కొంతమంది పోటీ చేస్తున్నారు.

భారీ పోలీసు బందోస్తు

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్ల గురించి పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 36 మండలాలలో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.

93 గ్రాడ్యుయేట్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, 38 టీచర్స్ ఎంఎల్‌సీ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, 8 మంది డీఎస్పీ లు, 27 మంది ఇన్‌స్పెక్టర్లు, 73 మంది ఎస్‌ఐలు, 1200 మందికి పైగా పోలీస్ సిబ్బందిని బందోబస్తు కు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. 8 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 21 స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్స్ 21, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ 36, పికెట్లు 22, వీడియో సర్వేలెన్స్ 36, బ్యాలట్ ఎస్కార్ట్‌కు 21 మొబైల్ పార్టీలు, ఒక ప్లటూన్ ఏపీఎస్‌పీ బలగాలను వినియోగిస్తున్నామన్నారు. 16 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని, ఎవరైనా ఉల్లంఘించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల సమీపంలో ఎవరూ ఉండరాదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా స్వశక్తితో జీవిస్తున్న ఆటో కార్మికుల కోసం సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆటో యూనియన్ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఆయన ఆదివారం విజయవాడ సిటీ బస్టాండ్ ఆవరణంలో ఆటో కార్మికుల కోసం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా అప్పుచేసి ఆటోలు కొనుగోలు చేసుకుని స్వశక్తిపై జీవిస్తున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ప్రోత్సహించకపోగా అనాలోచిన విధానాలు అమలు చేయడంలో వారు నష్టపోతున్నారన్నారు. ఈ-చలాన్‌లు, రోడ్డు పన్ను, పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధర పెంపు, పోలీసుల వేధింపులతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆటో కార్మికుల కోసంసంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డీజిల్- పెట్రోల్ గ్యాస్ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో ఒక శాతాన్ని అందుకోసం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బోర్డు బదలాయిస్తే వచ్చే ఆదాయం ద్వారా ఆటో కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చన్నారు. విజయవాడ నగర ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పక్కరాష్ట్రంలో సీఎన్‌జీ తక్కువ ధరకే వస్తుందని, పెట్రోల్ ధర ఏపీలో అధికంగా ఉందన్నారు. ఆర్థిక సమస్యలతో ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వాటిని నివారించాలనిచ ఇందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. లేనిపక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ విజయవాడ నగర అధ్యక్షులు ఎర్రరాములు, సంయుక్త కార్యదర్శులు పెంద్ర సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వెంకచ్చి, ఏఐటీయూసీ విజయవాడ నగర అధ్యక్షులు ఎ.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎ.సాంబశివరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటాం: బొప్పరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పునరుద్ఘాటించారు. విజయవాడ ఏపీ రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో అన్ని ప్రభుత్వ విభాగాల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఆదివారం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల పెంపుపై ప్రభుత్వానికి చాలా సార్లు విన్నవించామని గుర్తుచేశారు. 20ఏళ్లుగా ఒప్పందఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో కాలయాపన జరిగిందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. బడ్జెట్‌తో సంబంధం లేకుండా ఆర్థికేతర అంశాలైన మహిళా ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సెలవులు, ఇతర సౌకర్యాల కల్పనపై పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. 11వ పీఆర్సీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అధికారుల కమిటీ నిర్ణయించిన మేరకు వేతనాలు పెంచకపోగా 23 శాతానికే పరిమితం చేయడం బాధాకరమన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆప్కాస్ సేవలను విస్తృతపరిచి జిల్లా స్థాయిలో ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను అక్కడే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, చిరుద్యోగులైన ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానించింది. సమావేశంలో ఏపీ ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కె.సుమన్, ప్రధాన కార్యదర్శి భానూజీరావు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న కేంద్రం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్
- మోపిదేవి వెంకట్రావును ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు

విశాలాంధ్ర-చల్లపల్లి: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, మోపిదేవి గ్రామ ప్రముఖులు మోపిదేవి వెంకట్రావు సంస్మరణ సభ ఆదివారం మోపిదేవిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజలను వంచించిందని అన్నారు. ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చకుండా కుల రాజకీయాలు చేస్తూ కాలం గడుపుతోందని తెలిపారు. నరేంద్ర మోదీ కార్పొరేట్ కంపెనీల వద్ద మోకరిల్లుతున్నాడని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టు పార్టీల ఉద్యమాలతో బ్యాంకులను జాతీయకరణం చేయడంతో అనేక మంది పేద ప్రజలకు లబ్ధి జరిగిందని, అయితే మోదీ ప్రభుత్వ నిర్ణయాల వల్ల అదానీ, అంబానీకి లబ్ధి చేకూరుతోందని విమర్శించారు. పూటకో పార్టీ మారుతున్న నాయకులున్న ఈ రోజుల్లో నిబద్ధత గల కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా తుది శ్వాస వరకు పార్టీ కోసం పని చేసిన నాయకుడు వెంకట్రావు అని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ మోపిదేవి గ్రామ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని, చల్లపల్లి జమీందార్‌కు వ్యతిరేకంగా జరిగిన అనేక భూ పోరాటాలలో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు, కామ్రేడ్ కంతంనేని అచ్చుతరామయ్యతో కలిసి క్రియాశీలకంగా పని చేసి ప్రజల పక్షాన నిలిచారన్నారు. మోపిదేవి కరకట్ట మీద నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కంతంనేని అచ్చుతరామయ్య చేసిన పోరాటంలో ఆయనకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. నేటితరం నాయకులు వెంకట్రావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా ఇన్‌ఛార్జ్ కార్యదర్శి టి.తాతయ్య మాట్లాడుతూ మోపిదేవి వెంకట్రావు మృతి పార్టీకి తీరని లోటని నివాళులర్పించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడలో పని చేసిన వెంకట్రావు నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయంగా నిలుస్తారన్నారు. అధినాయకత్వం పిలుపులో భాగంగా సాగిన అనేక కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలలో ఆయన ముందుండి నడిచేవారన్నారు. టీడీపీ నాయకులు, మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలలో ముందుండే వెంకట్రావు పంచాయతీ పాలకవర్గం సభ్యులుగా గ్రామ అభివృద్ధి కోసం పరితపించేవారని గుర్తు చేశారు. తొలుత పార్టీ నాయకులు... వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, ఎంపీపీ రావి దుర్గావాణి, గుత్తికొండ రామారావు ప్రసంగించారు. సీపీఐ సీనియర్ నాయకులు పులిగడ్డ కోటేశ్వరరావు, చంద్ర సుబ్బారావు, మల్లుపెద్ది బోసు, డొక్కు శ్రీనివాసరావు, రావి రత్నప్రసాద్, రావి ప్రభుప్రసాద్, బండి రామకృష్ణ, మోపిదేవి గ్రామ శాఖ కార్యదర్శి కొలుసు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయంపై చర్చకు సిద్ధమా?

పవన్‌కు జోగి రమేశ్ సవాల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సామాజిక న్యాయంపై చర్చకు సిద్ధమేనా? చంద్రబాబు ప్యాకేజీకి అమ్ముడుపోనని చెప్పగలరా? అంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర మంత్రి జోగి రమేశ్ సవాల్ విసిరారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్‌కు వరుస ప్రశ్నలు సంధించారు. బీసీల డిక్లరేషన్ చేయడం కాదు... బీసీలకు ఎవరు మేలు చేశారనే దానిపై చర్చకు వచ్చే దమ్ముందా? బీసీలతో చంద్రబాబు పల్లకీ మోయించడమే పవన్ ఉద్దేశ్యమా?కాపులు, బీసీలను చంద్రబాబు వద్ద తాకట్టు పెడతావా? అని ప్రశ్నించారు. సామాజిక న్యాయ నిర్మాత సీఎం జగన్ అని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అత్యధిక ప్రాధాన్యతిచ్చారని, రాజకీయ సాధికారత, ఆర్థిక చేయూత కల్పించారన్నారు. యావత్ దేశానికే ఇవాళ సీఎం ఆదర్శప్రాయమని, అయన బాటలో నడిచేందుకు ఎందరో సీఎంలు ఆసక్తి చూపుతున్నారన్నారు. 2014 ఎన్నికల్లో బీసీలకు చంద్రబాబు, పవన్ 125 హామీలిచ్చినా, ఏ ఒక్కటీ నెరవేర్చలేదని గుర్తుచేశారు. ముందుగా బీసీలకు పవన్ క్షమాపణ చెప్పాలన్నారు. అసలు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదంటూ పవన్‌ను ఉద్దేశించి రమేశ్ అన్నారు. పవన్ పగటి వేషగాడని, ఈ మధ్య బీసీల కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాడని, ఆయన చంద్రబాబుకు పెద్ద పాలేరని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, సోము వీర్రాజు కలిసి 2014 ఎన్నికల సమయంలో పెద్ద మేనిఫెస్టో విడుదల చేశారని, అందులో బీసీలకు 125 హామీలు ఇచ్చినా, ఏవీ అమలు చేయలేదన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీసీ డిక్లరేషన్ చేస్తామని ఆ పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్ చెప్పారు. నన్ను ఆహ్వానిస్తే ఒంటరిగా వస్తా. గొడవ కోసం కాదు. బీసీ డిక్లరేషన్‌పై చర్చకు' అని జోగి రమేశ్ అన్నారు.

మేము దేనికైనా సిద్ధం: భాస్కర్ రెడ్డి

విశాలాంధ్ర-కడప బ్యూరో: తాము దేనికైనా సిద్ధమని వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు. వివేకా హత్య కేసు విచారణకు సంబంధించి వైఎస్ భాస్కర్ రెడ్డి తన న్యాయవాది కొండారెడ్డితో కలిసి ఆదివారం పులివెందుల నుంచి కడప సెంట్రల్ జైలు గెస్ట్ హౌస్‌లో బస చేసిన సీబీఐ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. విచారణ చేయవలసిన సీబీఐ అధికారి లేకపోవడంతో పులివెందులకు వెనుదిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా సెంట్రల్ జైలు వద్ద విలేకరుల సమావేశంలో భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు నన్ను సీబీఐ వారు విచారణకు రావాలని కోరారని, వారి మాటలను గౌరవించి ఆరోగ్యం సరిగా లేకపోయినా అదే పనిగా వచ్చానని తెలిపారు. కానీ విచారణాధికారి లేనందున వెనుదిరిగి వెళుతున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించి అన్ని విషయాలు హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అవినాష్ రెడ్డి చెప్పారని, అందువల్ల తాను దీనిపై ఏమీ మాట్లాడదలచుకోలేదన్నారు. ఈ కేసు పరిష్కారం కావాలంటే హత్య జరిగిన స్థలంలో లభించిన లెటర్‌లోని అంశాలను విచారించడం తప్ప వేరే మార్గం లేదన్నారు. ఎన్ని విచారణా సంస్థలు వచ్చినా ఆ లెటర్‌ను దర్యాప్తు చేయాలని చేతులెత్తి నమస్కరిస్తున్నామని తెలిపారు. తిరిగి నోటీసులు ఇస్తామని చెప్పారని, నోటీసు అందుకున్న తర్వాత తిరిగి హాజరవుతామని అన్నారు. వైఎస్ అవినాష్ రెడ్డితో పాటు మిమ్మల్ని అదుపులోకి తీసుకుంటామంటూ సీబీఐ తరపున న్యాయవాది తెలంగాణ హైకోర్టుకు తెలియజేసిన అంశంపై మీడియా ప్రతినిధులు భాస్కర్ రెడ్డిని ప్రశ్నించగా తాము దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. భాస్కర్ రెడ్డిని సీబీఐ అధికారులు గత ఏడాది క్రిందట వరుసగా రెండు రోజుల పాటు పులివెందుల ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విచారించిన విషయం విదితమే. కేసును పక్కదారి పట్టించకుండా, వాస్తవాలను పరిగణలోనికి తీసుకొని, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఆయన సీబీఐ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

కడప సెంట్రల్ జైలు వద్ద భారీ పోలీసు బందోబస్తు

వైఎస్ భాస్కర్ రెడ్డి సీబీఐ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యేందుకు కడప సెంట్రల్ జైలు వద్దకు వస్తుండడంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నెల 10న సీబీఐ అధికారులు ఈ కేసుకు సంబంధించి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డిని అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయని తెలంగాణ హైకోర్టులో పేర్కొనడంతో పులివెందుల, కడప పట్టణాల నుంచి వైఎస్ భాస్కర్ రెడ్డి అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సెంట్రల్ జైలు వద్దకు చేరుకున్నారు. దీంతో జైలు వద్ద తోపులాట జరిగింది. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. విచారణకు హాజరయిన భాస్కర్ రెడ్డి... అధికారి లేకపోవడంతో పులివెందులకు తిరిగి వెళ్లిపోయారు.

టీచర్ల ఆత్మగౌరవాన్ని గెలిపించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఉద్యమ నాయకులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న పిలుపు నిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న రెండు లక్షల మంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని తగ్గించే కుట్రకు ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని తగ్గించేలా ప్రభుత్వం కొంతకాలంగా ప్రయత్నిస్తోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 11వ పీఆర్సీకి సంబంధించి గతేడాది ఫిబ్రవరి 3వ తేదీ నాటి చలో విజయవాడ-బీఆర్టీఎస్ నుంచి ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, వారికి రావాల్సిన పీఆర్సీ బకాయిలు, కరువు భత్యం, భవిష్యనిధి, జీవిత బీమా బకాయిలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. వేతనాల కోసం ప్రతినెలా ఉపాధ్యాయులు పడిగాపులు పడాల్సి వస్తోందన్నారు. ఉపాధ్యాయులకు చెందిన గృహ రుణాలు వ్యక్తిగత రుణాలు, నెలసరి వాయిదాల చెల్లింపులకు బ్యాంకుల అపరాధ రుసుముల మొత్తానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను ప్రభుత్వ వ్యతిరేకులుగా, ప్రజా వ్యతిరేకులుగా చిత్రీకరిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్య ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వచ్చాక...ప్రాంతీయ విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారుల దాడులు ఎక్కువయ్యాయని, చిన్నచిన్న కారణాలతో ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. నాడు-నేడు కార్యక్రమంతో మొదటి విడతలో ప్రాథమిక పాఠశాలలను అందంగా తీర్చిదిద్దుకున్నామని. ఆ సంతోషం ఆవిరయ్యేలా ప్రభుత్వం అశాస్త్రీయంగా 3,4,5 తరగతులను దగ్గర ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిందన్నారు. సీపీఎస్ రద్దు చేయకుండా మోసం చేసిందన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

జనసేనలోకి ఇద్దరు మాజీ శాసనసభ్యులు

విశాలాంధ్ర-మంగళగిరి: ప్రకాశం జిల్లా, ఒంగోలు మాజీ శాసనసభ్యులు ఈదర హరిబాబు, పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు మాజీ శాసనసభ్యులు టీవీ రామారావు ఆదివారం తమ అనుచరులతో కలసి జనసేన పార్టీలో చేరారు. రామారావు వైసీపీకి రాజీనామా చేసి జనసేనలోకి వచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరికి పవన్ కల్యాణ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. భీమిలి నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేతలు చందరావు, అక్కరమాని దివాకర్ కూడా జనసేనలో చేరారు.కార్యక్రమంలో పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, భీమిలి ఇంఛార్జ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై విషం కక్కుతున్నారు

- జీవనశైలి... వేషధారణను ప్రశ్నిస్తున్నారు
- హక్కుల సాధనకు ఉద్యమించాలి
- ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని
- అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సభలో పాల్గొన్న ప్రముఖులు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: శ్రామిక మహిళా పోరాటం స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని పిలుపునిచ్చారు. ఏపీ మహిళా సమాఖ్య చిలకలూరిపేట ఏరియా సమితి అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సభకు ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దుర్గాభవాని మాట్లాడుతూ ఎందరో బలిదానాలతో సాధించుకున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, ఇటువంటి శక్తుల పట్ల మహిళలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రవచనాలు చెప్పే కొంతమంది మహిళల జీవన శైలి, వేషధారణపై విషం కక్కుతున్నారని, ఇటువంటివారికి మహిళలు బుద్ధి చెప్పాలని కోరారు. ఇప్పటికీ అటువంటి వారు స్త్రీని విలాస వస్తువుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల బాలిక నుంచి కళాశాలల విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు వరకు అన్ని రంగాల్లో ఉన్న మహిళలు ప్రతి నిత్యం ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత శిఖరాల్లో నిలిచిన మహిళకు ఇంకా లింగ వివక్ష, హింస, దురాగతాలు తప్పడం లేదని తెలిపారు. మహిళల్లో అనారోగ్య సమస్యలు కనిపిస్తున్నాయని, ముందస్తుగా పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. నరసరావుపేటకు చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సి.గౌతమి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అందివస్తున్న సాంకేతిక పరిజ్ఞానం భ్రూణ హత్యలకు కారణమవుతున్నాయని, దీనివల్ల ఒక్కో సందర్భంలో తల్లి ప్రాణానికే ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. మార్పు మన నుంచే మొదలవ్వాలని, ఆడ శిశువులను గర్భంలోనే అంతమొందించే వారిని ఉపేక్షించరాదన్నారు. చట్టాలు ఉన్నా అమలులో కొన్ని సార్లు విఫలమవుతున్నాయని వెల్లడించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు స్వేచ్ఛ, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి చట్టాలు తీసుకొచ్చినా ఇంకా పోరాటాలు, ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. మహిళలు అంతరిక్షం నుంచి కుటుంబం దాకా సాధించిన ప్రగతి ఒక్క రోజులో సాధ్యం కాలేదన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పోరాట స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఏపీ మహిళా సమాఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షురాలు నాగబైరు రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ఐక్య పోరాటాలతో మహిళల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి బి.లలితకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధమాన గాయని బెల్లంకొండ భారతిని ఘనంగా సన్మానించారు.

సాహితి

యాత్రా స్మృతుల ధ్రువతార పొట్టెక్కాట్

చాలామంది సాహిత్యవేత్తలు భిన్నమైన సాహిత్య ప్రక్రియలలో తమ ప్రతిభ ప్రదర్శిస్తుంటారు. ఒకే సాహిత్య ప్రక్రియకు పరిమితమైన వారు చాలా తక్కువ. కాని మలయాళ రచయిత శంకరన్ కుట్టి కుంజిరామన్ పొట్టెక్కాట్ (14.3.1913-6.8.1982) ఇతర సాహిత్య ప్రక్రియలలో కూడా ఎన్నదగిన వారైనప్పటికీ యాత్రా స్మృతులు రాయడంలో ఇతరులెవరూ చేయని కృషి చేసి ఈ ప్రక్రియలో ధ్రువతారగా వెలిగారు. బయటి ప్రపంచం ఎలా ఉంటుందో తెలియడానికి అవకాశాలు ఎక్కువగా లేని సమయంలో, కనీసం టీవీ ద్వారా అయినా ఇతర ప్రాంతాలు, దేశాల గురించి తెలుసుకునే అవకాశం లేని రోజుల్లో పొట్టెక్కాట్ దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించడమే కాక ప్రపంచమంతా చుట్టి వచ్చారు. ఆయన విమాన ప్రయాణానికన్నా సముద్రయానానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఒక ప్రాంతాన్ని సందర్శిస్తున్నప్పుడు కాలి నడకన ఆ ప్రాంతాన్ని చూడడానికే ఇష్టపడేవారు. అప్పుడే ఆ ప్రాంత ప్రజల జీవన విధానాన్ని, సంస్కృతిని పరిశీలించడం సాధ్యం అని పొట్టెక్కాట్ భావించే వారు. పైగా ఆయన పర్యటన నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం సాగింది కూడా కాదు. "నేను ముందుగా ప్రణాళిక వేసుకుని ఏ ప్రాంతాన్నీ చూడలేదు. ఏ ప్రాంతమైనా నాకు ఆసక్తి కలిగిస్తే అక్కడ మూడు నాలుగు రోజులు ఉండిపోయే వాడిని. ఆ ప్రాంతం నా మనసుకు నచ్చలేదంటే వెంటనే వెళ్లి పోయేవాడిని. అనేక చోట్ల నేను చేసిన పని ఇదే" అన్నారు పొట్టెక్కాట్.

పొట్టెక్కాట్ ఒక అసంపూర్ణ నవల (నార్త్ అవేన్యూ)తో సహా 11 నవలలు, 24 కథా సంపుటాలు, మూడు కవితా సంకలనాలు, నాలుగు నాటకాలు, ఒక వ్యాస సంకలనం, రెండు సొంత అనుభవాలు వెలువరించారు. కాని వీటన్నింటిలోనూ 18 యాత్రా స్మృతులు విశిష్టమైనవి. ఈ స్మృతులు మొదట విడివిడిగా ప్రచురితం అయిన తర్వాత మూడు సంకలిత సంపుటాలుగా వెలువడ్డాయి. పొట్టెక్కాట్ కు రాజకీయాలతో కూడా సంబంధం ఉండేది. 1957లో తెలిచెర్రీ నుంచి లోక సభకు పోటీ చేసి వెయ్యి ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత మళ్లీ పోటీ చేసి 1962 నుంచి 1967 దాకా లోకసభ సభ్యులుగా ఉన్నారు.

పొట్టెక్కాట్‌కు వివిధ ప్రాంతాలు సందర్శించడానికి వ్యక్తిగత అభిరుచి ఒక కారణం అయితే ఆయన తండ్రి కుంజిరామన్ మృతి తర్వాత ఎదురైన పరిణామాలు కూడా మరింత బలమైన కారణం అయి ఉండాలి. కుంజిరామన్ మృతి తర్వాత ఆస్తి పంపకాలు జరిగాయి. అది పొట్టెక్కాట్‌ను బాగా కుంగదీసింది. ఆస్తి పంపకాలలో భాగంగా పొట్టెక్కాట్ పెరిగిన ఇంటినుంచి తల్లితో కలిసి మరోచోటికి మారాల్సి వచ్చింది. మరో ఇంట్లో స్థిరపడిన తర్వాత యాత్రలకి ఉపక్రమించారు. అక్కడి నుంచి ఆయన చీకటిఖండం అనుకునే ఆఫ్రికాతో పాటు ప్రపంచంలోని అనేక ప్రాంతాలను సందర్శించారు.

విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత పొట్టెక్కాట్ 1936 నుంచి 1939 దాకా ఒక గుజరాతీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. కాని త్రిపురలో జరిగిన కాంగ్రెస్ మహాసభకు హాజరుకావడం కోసం ఉద్యోగం వదిలేశారు. 1941లో భారత యాత్రచేశారు. 1945లో కేరళకు తిరిగి వచ్చారు. తర్వాత బాంబే సందర్శించారు. అక్కడ బతకడానికి అనేకరకాల ఉద్యోగాలు చేశారు. కాని ఆ ఉద్యోగాలేవీ ఆయనకు నచ్చలేదు. 1949లో మొట్ట మొదటిసారి విదేశీయాత్ర చేశారు. ఆ యాత్ర రెండేళ్లు కొనసాగింది. యూరప్, అమెరికా, దక్షిణాసియా, ఆఫ్రికాలోని అనేక ప్రాంతాలు ... న్యాసాలాండ్, సూడాన్, ఉగాండా, ఈజిప్ట్, తూర్పు ఆఫ్రికా దేశాలు, పోర్చుగల్, ఇటలీ, స్విట్జర్లాండ్, జర్మనీ ఫ్రాన్స్, ఇంగ్లాండ్ సందర్శించారు.

1952లో పెళ్లి చేసుకుని భార్య జయవల్లితో పాటు ఆసియాదేశాల యాత్ర చేశారు. ఎక్కడికి వెళ్లినా అక్కడి సామాన్య ప్రజలతో కలిసిపోయే వారు. ఆ యాత్రల అనుభవాలన్నింటినీ గ్రంథస్థం చేశారు. ఒరు తెరువింటె కథ (ఒక వీధి కథ) గ్రంథానికి పొట్టెక్కాట్‌కు 1961లో కేరళ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. ఒరు దేస్తింతె కథ (ఒక ప్రాంతం కథ(?) కు

1972లో కేరళ సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా దక్కాయి. మలయాళ భాషకు, సాహిత్యానికి చేసిన విశిష్టమైన సేవకు 1980లో జ్ఞానపీఠ్ అవార్డు వచ్చింది. ఆయన యాత్రాస్మృతులన్నీ ఆత్మకథల్లా ఉంటాయి. అవి ఉన్నత సాహిత్య విలువలతో కూడుకున్నవి. పాఠకులను సునాయాసంగా ఆకర్షిస్తాయి. పొట్టెక్కాట్ రచనలు ఇంగ్లీషు, ఇటాలియన్, రష్యన్, జర్మన్, చెక్ భాషలతో పాటు ప్రధానమైన భారతీయ భాషలన్నింటిలోకి అనువాదమైనాయి. పొట్టేక్కాట్‌కు మనుషులంటే విపరీతమైన ప్రేమ.

ఒకచోటి నుంచి మరో చోటికి వెళ్లడానికి ఆయన వాడని పద్ధతి లేదు. బస్సులు, రైళ్లు, గాడిదలు, కంచెర గాడిదలతో సహా వేటినైనా వినియోగించుకున్నారు. ఓడల పైకప్పు మీద కూడా ప్రయాణించారు. అక్కడ అనేకరకాల వారు కనిపిస్తారనే వారు. ఎగువ తరగతి ప్రయాణీకులతో కలిసి వెళ్తే కలిగే ఆనందం కృత్రిమమైందని చెప్పేవారు. ఓడ పైకప్పు మీద నిజమైన మనుషులు తారస పడతారన్నది ఆయన అనుభవం. కేరళలో కూడా ఆయన సంచరిస్తున్నప్పుడు దారిలో కనిపించిన వారి ఇంట్లోనైనా భోజనం చేసేవారు. ప్రజా జీవనాన్ని నిశితంగా పరిశీలించడం కోసమే ఆయన ఈ పద్ధతి అనుసరించారు. విమాన ప్రయాణాలు అంతగా ఇష్టపడేవారు కాదు. ఒకసారి ఆఫ్రికా నుంచి సూడాన్ వెళ్తున్నప్పుడు రాయబార కార్యాలయ అధికారి విమానంలో వెళ్తే బాగుంటుంది కదా అంటే "నేను సూడాన్ చూడడానికి వచ్చాను తప్ప ఆకాశాన్ని చూడడానికి కాదు" అని పొట్టెక్కాట్ బదులిచ్చారు.

సోవియట్ యాత్ర గురించి రాస్తూ అక్కడి ప్రజలు ఆత్మ విశ్వాసం, అర్థంచేసుకునే తత్వం, ఇతరులను అక్కున చేర్చుకునే లక్షణం కలవారు అన్నారు. సోవియట్ ప్రజల "మానవత్వం" ఆయనను బాగా ఆకట్టుకుంది. అక్కడ మెరుగైన ఆలోచనల కోసం అన్వేషిస్తారు అంటారు. ప్రేమించదగినవారు ప్రపంచంలో మిగతాచోట్ల కూడా ఉంటారు. కాని ఇతరులను ప్రేమించడానికి తపనపడే వారు ఇక్కడ తప్ప ప్రపంచంలో ఎక్కడా ఉండరు అని పొట్టెక్కాట్ చెప్పారు. వీధుల్లో, పరిశ్రమల్లో, సినిమాహాళ్లలో, పార్కుల్లో, చిన్నపిల్లల పాఠశాలల్లో, ఇళ్లల్లో వారిప్రేమ అనుభవం లోకి వస్తుంది అంటారు. ఆయన ఆలోచనాపరుడే కాని కమ్యూనిస్టు కాదు. అందుకే సోవియట్ వ్యవస్థ "కడిగిన ముత్యం లాంటిది ఏమీ కాదు" అన గలిగారు. తాను సంచరించిన చోట కనిపించిన సాంస్కృతిక వైవిధ్యాన్ని అక్షరబద్ధం చేశారు. ఆయన యాత్రా స్మృతులు ఆ ప్రాంతాలు సందర్శించడానికి అవకాశం లేని వారికి కూడా సందర్శించినంత అనుభవం కలగ చేస్తాయి. అయితే ఆయన ప్రత్యేకంగా కేరళీయులను దృష్టిలో ఉంచుకుని రాశారు. ఆయన యాత్రా స్మృతులకు అంతర్జాతీయ ఖ్యాతి రాకపోవడానికి ఇదీ ఒక కారణం కావొచ్చు.

ప్రపంచంలో కొనసాగుతున్న దోపిడీ, అణచివేతను ఆయన ఈసడించేవారు. విదేశాలలో తనకు కనిపించిన సాంస్కృతిక, జాతివివక్షకు వ్యతిరేకంగా గొంతెత్తారు. గ్రామీణ ప్రాంతాలలో బానిసలు నడవడానికి ఉద్దేశించిన ప్రత్యేకమార్గాలు ఆయనకు మానవత్వంపై ఎత్తిన కొరడాల్లా కనిపించాయి. ఆఫ్రికా ప్రజల వెనుకబాటు తనాన్ని ప్రస్తావిస్తూ "వారికి నిన్న అంటే అనేక శతాబ్దాల కింద. వారి రేపు అంటే మరెన్నో శతాబ్దాల తర్వాత" అంటారు పొట్టెక్కాట్. వివిధ ప్రాంతాలలో ఆహారపు అలవాట్ల గురించి చెప్తూ చైనీయులు నీటిలో ఉండే పడవను, ఆకాశంలో ఎగురుతున్న గాలిపటాన్ని, నాలుగు కాళ్లు ఉండే వాటిలో బల్లను తప్ప అన్నీ తింటారు అని చాలా కవితాత్మకంగా వర్ణిస్తారు. జీవన విధానాన్ని తెలియజెప్పడానికే పొట్టెక్కాట్ ఈ వివరాలన్నీ రాశారు. అనేక కొత్తవిషయాలు ఆయన రచనల వల్ల పాఠకులకు అనుభవంలోకి వస్తాయి. బాలి ద్వీపంలోని వారు అలసత్వానికి, యూరప్ వాసులు అహంభావానికి, ఆఫ్రికావాసులు అశాంతికి ప్రతీకలు అంటారు పొట్టెక్కాట్.

ఆయన యాత్రా స్మృతులలో వర్ణించిన వ్యక్తులే ఆయన కథల్లో, నవలల్లో కూడా తారసపడతారు. పొట్టెక్కాట్ ఎక్కడికెళ్లినా స్థానిక భాషను అంతో ఇంతో నేర్చుకోవడానికి ప్రయత్నించే వారు. ఇండొనీషియా వెళ్లినప్పుడు ఆ భాషను, ఆఫ్రికాలో ఉన్నప్పుడు స్వాహిలి, అరేబియా దేశాలకు వెళ్లినప్పుడు అరబ్బీ ఒంటబట్టించుకోవడానికి ప్రయత్నించారు. గుజరాతీలతో వారి భాషలోనే మాట్లాడేవారు. మానవ జీవితాల్లోని వివిధ అంశాలను పరిశీలించడం మీద ఆయనకు ఆసక్తి ఎక్కువ. షేక్స్పియర్, చాసర్, కీట్స్, షెల్లీ నివసించిన ప్రాంతాలను సందర్శించారు. ఆఫ్రికాను చీకటిఖండం అని పేర్కొనడం వలసవాదుల పనేనని భావించారు. ఆఫ్రికావాసులను తెల్లవారు దోపిడీ చేసినందువల్లే అది చీకటి ఖండమైందంటారు. సాంస్కృతికంగా ఆఫ్రికన్లకు, భారతీయులకు సంబంధం ఉందన్నది ఆయన పరిశీలన.

-ఆర్వీ రామారావ్



మనిషి తప్పిపోయాడు

మనిషి తప్పిపోయాడు
వర్షం వెతుకుతూ వుంది
చిరునామావుంది శరీరం లేదు!
వర్షం ఉడీసెత్తిందంటూ
వరుణుణ్ణి నిందిస్తూ
ప్రజాక్షేమం మరిచిన
మనిషి తప్పిపోయాడు!
ఇన్నాళ్ళూ కురిసిన
వర్షధారను
అరచేతులైనా
అడ్డేసి అడ్డుకోని మనిసి
సముద్రానికి దత్తం చేశాడు!
వానకురువబోతుంది
ఒడిసి పట్టుకోమంటూ
తప్పిపోయిన మనిషికై
వర్షం దేవులాడుతుంది!
మనిషి మాయమయ్యాడు
ఓటు వెతుకుతూ వుంది
మార్పు రావాలంటూ
పరవంజానెక్కి మేధావి విమర్శలు!
మార్పుకు మూలవిరాటైన
పోలింగు బూతుకు
అతడు ముఖంచాటు!
చేతికందే దూరంలో
పోలింగు కేంద్రం పిలుస్తుంది
బద్ధకం మేధావిని వదలదు
శీతలగది కదలనివ్వదు!
కోకిల కనపడటం లేదు
ఆరు ఋతువులు సమానమై
గున్నమామిడి గుబుర్లో వొదిగి
సంగీతం ఆలపిస్తూ
స్వర్గం సృష్టించిన కోకిల
హఠాత్తుగా అంతర్ధానమైంది
గాలింపుకు పోబిడీలేదు
మనసున పన్నీరద్దిన
సంగీత కచేరీలేదు!
మనిషి వేటగాడై
ఎక్కుపెట్టిన బాణం
మట్టుపెట్టిందని ప్రచారం!
మనిషి
మనీషిగా
మారటానికి
మానవత్వమే
దీర్ఘతపస్సు!

అడిగోపుల వెంకటరత్నమ్,
సెల్: 9848252946

పాఠకుల ఆర్తిని తీర్చే 'రాతి గుండెలో నీళ్లు'

కథ అంటే ఏమిటి అనేదానికి సార్వత్రిక నిర్వచనాలున్నా, అది ఎలా పుడుతుందనే దానికి స్పష్టమైన కారణాలు చెప్పలేం. రచయిత తను విన్నవి, కన్నవి, చదివినవి, తన అనుభవంలోకొచ్చిన అనేక సంఘటనల్లో మనసుకు నచ్చిన వాటిని ఎంచుకుని వాటికి సంభాషణలు పేర్చి సృజనాత్మకతతో రూపుకడతాడు. అతను ఎదుగుతున్న కొద్దీ అతని చూపు విశాలమవుతుంది. దృక్పథం మారుతుంది. శైలి, శిల్పం కొత్త సొబగులు అద్దుకుంటాయి. రాయగా.. రాయగా.. ప్రతి రచయితకీ తన సొంత గొంతు ఏర్పడుతుంది.

30 ఏళ్లవయసు.. 50 కథల అనుభవం ఉన్న దొండపాటి కృష్ణ మూసలో కొట్టుకుపోకుండా తనదైన ప్రత్యేకత చూపటానికి గుంజాటన పడుతున్నారు. సమకాలీన పత్రికలన్నింటిలోనూ ఆయన కథలు వస్తూంటాయి. కొన్ని కథలకు దక్కిన బహుమతులు ఈ యువరచయిత ప్రతిభకు తార్కాణాలు. ఇటీవల ఆయన వెలువరించిన 'రాతి గుండెలో నీళ్లు' కథా సంకలనం గురించి ఇప్పుడు మనం మాట్లాడుకుందాం. ఇందులో 16 కథలున్నాయి. ఇతివృత్తం పరంగా వాటిల్లో వైవిధ్యం కనిపిస్తుంది. రచయిత 'చూపు' మనకు అర్థమవుతుంది.

'కారు ఆగింది. అది సూర్యం హోదాను మోసుకొచ్చింది' ఇదీ 'వెలుగు సూర్యుడు' కథకు ప్రారంభ వాక్యం. ఓ అధికారి కారులో దిగగానే అందరు విస్తుపోయి చూడటం సాధారణమే. కానీ ఈ అధికారి అందరిలాంటివాడు కాదు. ఒకప్పుడు చెత్తకుప్పలో విసిరివేయబడ్డ పసిబిడ్డ. అతన్ని యాదయ్య అనే బిచ్చగాడు చేరదీస్తాడు. కొన్నాళ్ల తర్వాత ఆ పిల్లాడు అడితీలో పనికి చేరతాడు. చదువుకోవాలన్న అతని ఆకాంక్షకు నీరుపోసి పెంచి పోషిస్తాడు ఆ అడితీ యజమాని. దాంతో అతను బాగా చదువుకుని సోషల్ వెల్ఫేర్ ఆఫీసరుగా ఎదుగుతాడు. అంతే కాదు, తనను ఇంత వాడిని చేసినందుకు అతను అదే ఊరిలో అనాథ వసతి గృహం నిర్మాణానికి సిద్ధమవుతూ కృతజ్ఞత చూపటానికి సిద్ధమవుతాడు. ఫ్లాష్‌బ్యాక్ పద్ధతిలో సాగిన ఈ కథలో మెరుపులాంటి వాక్యాలు కనిపిస్తాయి. "జ్ఞానానికి, దీపానికి ప్రత్యేక గుర్తింపు అవసరం లేదు. అవి పాతాళంలో ఉన్నా దశదిశలకూ తమ కాంతులను ప్రసరింపచేస్తూ ఉంటాయి. అందుకే 'విద్య' అనే దీపం వెలిగించుకోవాలి/గమ్యమెరుగని అతని నావకు దారి చూపిన దార్శనికుడు. గతి తప్పిన అతని జీవితాన్ని శృతి చేసిన మహానుభావుడు/గొంగళి పురుగులా అక్కడే పడి కొట్టుమిట్టాడుతున్న అతని జీవితం సీతాకోకచిలుకలా ఎలా రంగుల మయంగా మారిందో గుర్తుకొచ్చింది. ప్రధాన పాత్రకు 'సూర్యం' అన్న పేరు ఉంచటంలోనే రచయిత ఉద్దేశ్యం బోధపడుతుంది.

ఇటీవల మగపిల్లలు పెళ్లి చేసుకోవటానికి వెనకాముందు ఆడుతున్నారు. ఉన్న సంపాదనతో ఇల్లు నెట్టుకురావటం కష్టమనే భయం వారిని వెనక్కిలాగుతోంది. 'ఊహల రెక్కలతో ఎగరనీయ్' కథలో ఇదే అంశంపై చర్చకు పెట్టారు. జీవితంలో సర్దుబాటు ఎంత అవసరమో చెప్పారు. నిరంతరం సోషల్ మీడియాలో మునిగిపోతున్న ఇల్లాళ్లకు భిన్నంగా, ఇంట్లో ఉన్నంతసేపు కుటుంబసభ్యులకు మాత్రమే వెచ్చించే 'ఇందిర' అన్న పాత్ర సృష్టించారు. "ఆఫీసు నుంచి ఇంటికొచ్చాక బంధువులతో కూడా ఫోన్ మాట్లాడదు. ఎంజాయ్ చేయటం అంటే మనుషులతో ప్రేమతో మెలగాలి. వస్తువులతో కాదు. వీలునుబట్టి వాళ్లను కలవచ్చు. మీరు, పాప నాకున్నారు. మీ సమయాల్ని నాకు కేటాయిస్తే చాలు' అంటుంది. ఈ కథలో పెళ్లి విశిష్టత గురించి రచయిత చర్చించారు. "మనుషులకు స్థూల, సూక్ష్మ, కారణ అనే మూడు శరీరాలుంటాయి. పెళ్లి సమయంలో వేసే ఒక్కో ముడి ఒక్కో శరీరానికి వేసేది. ఒక్క బాహ్యశరీరంతోనే కాదు. మొత్తం మూడు శరీరాలతో మమేకం కావటం అనే అర్థంలో మూడుముళ్లు వేస్తారు. ఈ మూడుముళ్లకు 'అనురాగపు ముడి'ని జత చేసి లైఫ్ జర్నీ చేయాలి. అది మనం చూపించే ప్రేమను బట్టి ఉంటుంది.

గ్రంథ సమీక్ష



రాతి గుండెలో నీళ్లు
-దొండపాటి కృష్ణ
వెల: రూ. 150
ప్రతులకు: రచయిత, ఫోన్ నెం 90523 26864

క్వాలిఫికేషన్ బట్టి కాకుండా క్యారక్టర్ ను బట్టి వివాహాలు విజయవంతమవుతాయి"అని చెప్పుకొచ్చారు.

మరో కథ 'ఇది కదా సంతోషం' లోనూ వివాహ ఔన్నత్యం గురించి చర్చ కనిపిస్తుంది. మనవడి వివాహవేడుకలను కళ్లారా చూసుకుని సంతసించిన తాతయ్య ఇందులో కనిపిస్తాడు. అణకువతో, నేర్పుతో సంసారాన్ని తీర్చిదిద్దిన తన భార్యను అలక్ష్యం చేశానన్న చింత ఆయనను వెంటాడుతూంటుంది. "నీరు ఎంత అమూల్యమైనదో, బావి ఎండిపోయే వరకూ మనకు తెలియదు. భార్య తోడుగా ఉన్నంతకాలం ఆమెను గ్రహించలేకపోయాను" అన్న ఆవేదనకు లోనవుతాడు. "భార్యలేని మగవాడి జీవితం అసంపూర్ణం. ఆమెతో గడిపిన క్షణాలే నీ జీవితం లో అమూల్యం" అని మనవడికి భార్య గొప్పతనాన్ని వివరించటంతో కథ ముగుస్తుంది.

'యాచకురాలు' కథలో బిచ్చగాళ్ల పట్ల సహానుభూతి కనిపిస్తుంది. "నీకు సాధ్యమైతే బిచ్చమెయ్యి. అంతే కానీ నోటికొచ్చినట్టు మాట్లాడి వాళ్లను చులకన చేయొద్దు" అన్న హితవు, "ఎదుటివారిని ఆదుకున్నప్పుడు, క్షమించినప్పుడు మన మొహంలో దైవత్వం కనిపిస్తుంది" అనే సందేశం ఇందులో మనం చూడొచ్చు.

సమాజం చిన్న చూపు చూసే యాచకులను ప్రయోజకులుగా, బాధ్యతగల కాంట్రాక్టు ఉద్యోగులుగా మలచిన మున్సిపల్ ఉద్యోగి ఉదంతం "మళ్లీ చిగురించారు" కథలో కనిపిస్తుంది.

మనిషికి పరిసరాలతోనూ, ప్రకృతితోనూ ఉండే అనుబంధం గాఢమైనది, బలీయమైనది. "స్వర్గసీమ", " రాముడు -భీముడు" కథలు ఈ విషయాన్ని బలంగా చాటుతాయి. తన ఇల్లు, పెరడులో పెంచుకున్న మొక్కలతో అవ్యక్తమైన అనుబంధాన్ని పెంచుకున్న అర్చన భర్త ఇల్లు అమ్మి సొంత ఊరికి వెళ్లిపోదామని చెప్పినప్పుడు తల్లడిల్లుతుంది. "స్వర్గమంటే అదెక్కడో ఉండదు. నిర్మలమైన మనస్సుతో, మనకున్న సౌకర్యాలతో సంతృప్తిగా బతికే జీవితమే స్వర్గం. ఇల్లే స్వర్గసీమ" అన్న స్పృహతో చివరికి భర్త తన నిర్ణయాన్ని మార్చుకుంటాడు. ఇక 'రాముడు-భీముడు కథలో, పదిమంది పిల్లలున్నా నిరాదరణకు గురైన రాముడు, భీముడు (వేపచెట్లు)నీడలో సేదతీరుతూంటాడు. అతను కన్నుమూసినప్పుడు ఆ కట్టలే అతనికి ఆధారమవుతాయి.

ఒక సామాజిక సమస్యపైన సామాజిక మాధ్యమాల్లో మద్దతు కూడగట్టటానికి సిద్ధమైన యువకుని ఉదంతం 'మైత్రీవనం'లోనూ, ప్రేమ ఉచ్చులో పడిపోకుండా, బాగా చదువుకుని బాధ్యతగా మెలగాలన్న సూచన 'చైతన్యకిరణం'లోనూ కనిపిస్తుంది. ఆగంతకుల దాడి నుంచి నేర్పుగా బయటపడిన యువతి కథ 'గుంట నక్కలు''.

ఈ సంకలనంలో రెండు కథలను ప్రస్తావించకపోతే, ఈ సమీక్ష అసంపూర్ణమవుతుంది. 'రాతిగుండెలో నీళ్లు, 'ఉరేసుకున్న మౌనం' అన్న ఈ రెండు కథలు రచయితకు బహుమతులు తెచ్చిపెట్టాయి. డ్వాక్రా సభ్యులు అకస్మాత్తుగా చనిపోతే, వారికి ఆర్థిక సాయం అందించే బాధ్యతలో ఉన్న రంజని అనే ఉద్యోగినికి చిత్రమైన అనుభవం. అది ఆమెలో మార్పుకు ఎలా కారణమయ్యిందో తెలియచెప్పే కథ "రాతి గుండెలో నీళ్లు". ఇందులో హిజ్రాల జీవితంలో సాధకబాధకాలను, కుటుంబ సభ్యుల నిరాదరణను హృదయవిదారకంగా చెప్పుకొచ్చారు రచయిత.

ఇక ఉరేసుకున్న మౌనం కథలో భర్త చేసే అవమానాలను భరించలేక జ్యోతి ఆత్మహత్యకు సిద్ధపడుతుంది. ఆఖరునిముషంలో అంతరాత్మ ప్రబోధంతో వెనక్కి మళ్లుతుంది. భర్త పశ్చాత్తాపానికి లోనవుతాడు. ఇలా ప్రతి కథలోనూ దొండపాటి తనదైన విశిష్టతను చూపారు. కథల పట్ల ఆసక్తిగల వారు తప్పనిసరిగా చదవవలసిన సంకలనమిది.

డాక్టర్ పార్థసారథి చిరువోలు, 99088 92065

దుఃఖ పర్వం

అది మాటకాదు కంఠంలో ఊపిరి
ఇది గీత కాదు దాటడానికి వీలులేని
ఒక భావోన్ముఖపు ఒప్పందం
చెప్పడం కూడా తప్పిదమే
మౌనంలో వాటిని
తగలబెట్టడమే ఉపశమనం
అటూ ఇటూ లోపలా బయటా
మాటాడావో పంచుకున్నావో
దుర్గంధమయ్యావే
కకావికలాన్ని కిరీటంగా ధరించినట్టే
కొన్ని కన్నీటి చుక్కలు కూడా రాలనీకు
మునిపంటికింద అదిమిపట్టి
ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసల్లో
ముంపుకు గురిచేసి దిగమింగు
కొన్ని ఒప్పుకో బయటపడనీకు
దుఃఖం గేట్లు పగలనీకు
వింటూ పో నచ్చినవి నచ్చనివి
మనల్ని మనం కాస్తైనా మిగిల్చుకోవడానికి
జీవితమంతా మంద్రస్థాయి యుద్ధం
సలపాలి కదా
ఇక్కడ వేరుపడడానికి వీలులేదు
ఉండాలి కత్తిపై సాము చేస్తూ
బతకాలి నెత్తిపై తొణికే కుండలవరసతో
ఇప్పుడు చెప్పు
కనురెప్పలవెనకాతలి గోసలు
కాస్తైనా నేను వింట
నిన్నేమీ అంచనా వెయ్య అగాధంలోకి తొయ్య
నలుగురి నాలుకల్లో నిన్ను పడనియ్య
మాటిస్తున్నా..
కడుపునిండా
ఏడుపు పేగులు చాచి వెక్కి వెక్కి
చివరి రాగం వరకూ ఊపిరి కొసవరకూ
అది చీకట్లని చీలుస్తూ
ఇంకో వ్యథల పొద్దుని
ఇట్టాగే తెల్లారనీ మట్టిలోకి ఇంకిపోనీ
తాజాగా మొహం కడుక్కో కిరణాల ఒడ్డున
లేత ఎండ ముక్కలతో...
గట్టిగా నిట్టూర్చి ఇక తేలికపడి పో
కొత్తగా నడుస్తూ
నేనొక కాల్పనిక కలగన్నాననుకుంట
చూస్తా నిన్ను మాత్రం
అల్లంత దూరం పొయేవరకు తదేకంగా
ఒట్టు ఎక్కడా చెప్ప ఏ దిక్కుకు
ఈ దుఃఖ పర్వాన్ని రాయ ఏ బతుకుపేజీలో
ఇది ఇంతటితో సమాప్తం..
నాలో పరిసమాప్తం!

- రఘు వగ్గు

కవితలకు ఆహ్వానం

మహామేధావి, భారతరత్న, డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా, విజయవాడలో125 అడుగులు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నందుకు, 125 మంది కవులతో, ఒక కవితా సంపుటి తీసుకుని రావాలనుకుంటున్నాం. కవులు తమ స్వంత కవితలను, మార్చి-20, 2023 సోమవారం లోగా తమ కవితలను 20-25 పంక్తులకు (లైన్లు) మించకుండా యూనికోడ్ ఫాంట్‌లో మాత్రమే పంపాలి. కవులు ఒక కవిత మాత్రమే పంపాలి. తప్పనిసరిగా హామిపత్రం జతచేయాలి. కవితలను ప్రచురించే పూర్తి హక్కు సంపాదకవర్గం వారిదే.

మీరు పంపవలసిన మెయిల్ ఐడి :
sonytangirala@gmail.com కు పంపగలరు.
వివరాలకై : తంగిరాల సోని, 9676609234ని సంప్రదించగలరు.

కాంగ్రెస్ పగటి కలలు

నాకు సమాధి కట్టాలనుకుంటున్నారు

నేను అభివృద్ధి చేస్తున్నా...

కర్ణాటకలో మోదీ విమర్శలు

మాండ్య: కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్రమోదీ ఎదురుదాడికి దిగారు. తన సమాధి తవ్వడంలో ప్రతిపక్షాలు బిజీగా ఉంటే తాను మాత్రం దేశాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్నానని మోదీ చెప్పుకొచ్చారు. ప్రజల ఆశీస్సులే తనకు రక్షణ కవచంగా ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 2014కు ముందు పేద ప్రజల జీవితాన్ని పతనం అంచులకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న ఏ అవకాశాన్ని వదులుకోలేదని మోదీ ఆరోపించారు. పేదల సొమ్ము అడ్డంగా దోచుకుందని ఆ పార్టీపై విమర్శలు గుప్పించారు. మాండ్యలో బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. మోదీకి సమాధి కట్టాలని కాంగ్రెస్ కలలు కంటుంటే..బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించి ప్రజలకు సుఖవంతమైన జీవితం అందించడంలో తాను బీజిగా ఉన్నానని మోదీ అన్నారు. మోదీకి సమాధి కట్టాలని వారనుకుంటున్నా, దేశంలోని తల్లులు, సోదరీమణులు, ప్రజలంతా తనకు రక్షణ కవచంలా ఉన్నారని గొప్పగా చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పేద ప్రజలు ఎలాంటి ప్రయోజనం పొందాలన్నా కాళ్లరిగేలా కింద నుంచి పైవరకూ తిరగాల్సి వచ్చేదని, బీజేపీ హయాంలో నేరుగా ఇంటి వద్దకే పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని మోదీ చెప్పారు. అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన దేశవ్యాప్తంగా జరుగుతోందన్నారు. కర్ణాటకతో పాటు దేశమంతటా అభివృద్ధిపరంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కేవలం సౌలభ్యం కోసమే కాదని, ఉద్యోగాలు, పెట్టుబడులు వస్తాయని, ఆదాయ వనరులు తెస్తుందని చెప్పారు. 2002లో భారతదేశం రికార్డు స్థాయి పెట్టుబడులు సాధించిందని తెలిపారు. దీనివల్ల కర్ణాటకకు ఎక్కువగా ప్రయోజనం చేకూరిందన్నారు. కోవిడ్ మహమ్మారి ఎదురైనా కర్ణాటకలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టామని, తొమ్మిదేళ్లలో 2 కోట్లకు పైగా పేద ప్రజలకు ఇళ్లు కట్టించామన్నారు. ఒక్క కర్ణాటకలోనే లక్షలాది ఇళ్ల నిర్మాణం జరిగిందని, జల్ జీవన్ మిషన్ కింద 40 లక్షల కుటుంబాలకు ట్యాప్ వాటర్ అందించామన్నారు. దేశంలో దశాబ్దాలుగా నీటిపారుదల ప్రాజెక్టులను పెండింగ్‌లో ఉంచారని, ఎగువభద్ర ప్రాజెక్టు ద్వారా వాటిని వేగవంతం చేశామని ప్రధాని చెప్పారు. చెరకు రైతులకు బడ్జెట్‌లో అనేక వెసులుబాట్లు కల్పించామప్పారు. 2013-14 నుంచి రూ.17వేల కోట్ల ఇథనాల్‌ను చక్కెర కర్మాగాల నుంచి కొనుగోలు చేస్తున్నామని, ఈ సొమ్ము చెరకు పండించే రైతులకు చేరుతుందని చెప్పారు. బయోటెక్నాలజీ నుంచి రక్షణరంగ ఉత్పత్తుల తయారీ, ఏరోస్పేస్ నుంచి ఈవీల వరకూ కర్ణాటక కొత్త పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా ఉందని చెప్పారు. మాండ్యలోని చక్కెర రైతుల ఆదాయం పెరిగేందుకు ఇథనాల్ ఉత్పత్తిని పటిష్టం చేయనున్నామని భరోసా ఇచ్చారు.

ఆరు లైన్ల బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని ప్రారంభించారు. రూ.8,480 కోట్ల వ్యయంతో అభివృద్ధి పరచిన 118 కిలోమీటర్ల పొడవైన ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో బెంగళూరు, మైసూరు మధ్య ప్రయాణ సమయం 3 గంటల నుంచి 75 నిమిషాలకు తగ్గుతుంది. మాండ్య, హుబ్లి-ధార్వాడ్ జిల్లాల్లో రూ.16 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం, జేడీఎస్‌కు మాండ్య కంచుకోటగా ఉన్న నేపథ్యంలో ప్రధాని మాండ్య పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

తుపాకీ సంస్కృతిపై కొరడా

పంజాబ్‌లో 813 గన్ లైసెన్సుల రద్దు

చండీగఢ్: పంజాబ్‌లో పెరుగుతున్న తుపాకీ సంస్కృతిపై భగవంత్ సింగ్ మాన్ సారథ్యంలోని ఆ రాష్ట్ర సర్కార్ కొరడా ఝుళిపించింది. రాష్ట్రంలోని 813 తుపాకుల లైసెన్సులు రద్దు చేసింది. లూథియానా రూరల్‌లో 83 తుపాకుల లైసెన్సులు రద్దు చేయగా, షహీద్ భగత్ సింగ్ నగర్ నుంచి 48, గురుదాస్‌పూర్ నుంచి 10, ఫరీద్‌కోట్ నుంచి 84, పఠాన్‌కోట్ నుంచి 199, హోషియాపూర్ నుంచి 47, కపుర్తలా నుంచి 6, ఎస్ఏఎస్ కస్బా నుంచి 235, సంగ్రూర్ నుంచి 16 తుపాకుల లైసెన్సులు రద్దు చేశారు. అమృత్‌సర్ కమిషనరేట్‌లోని 28 మంది, జలంధర్ కమిషనరేట్, ఇతర జిల్లాల నుంచి 11 మంది లైసెన్సులు రద్దయ్యాయి. పంజాబ్ ప్రభుత్వం ఇంతవరకూ 2,000కు పైగా ఆయుధాల లెసెన్సులు రద్దు చేసింది. గన్‌ల విషయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. బహిరంగ ప్రదేశాల్లోకి తుపాకులు తీసుకు వెళ్లడం, ప్రదర్శించడంపై నిషేధం ఉందని, రాబోయే రోజుల్లో విస్తృతంగా తుపాకుల తనిఖీలు ఉంటాయని తెలిపింది. తుపాకీ సంస్కృతిని తుదముట్టించేందుకు చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. పంజాబ్‌లో 3,73,053 ఆయుధాలకు లైసెన్సులు ఉన్నాయి. 28 ఏళ్ల పంజాబ్ సింగర్ సిద్ధు మూసేవాలాను గత ఏడాది పట్టపగలే దుండగులు కాల్చిచంపిన ఘటన పంజాబ్‌లో కలకలం రేపింది. తుపాకీ సంస్కృతిపై మరోసారి చర్చకు దారితీసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 8.11 మిలియన్ల ఫాలోయర్లు ఉన్న సిద్ధూ మూసేవాలాపై గన్ కల్చర్‌ను ప్రోత్సహించారనే ఆరోపణలు వచ్చాయి. ఆయన ఆయుధాలు పట్టుకున్న ఫోటోలు, వీడియోలు వైరల్ కావడంతో కేసు నమోదు చేశారు.

ములాయం, శరద్ యాదవ్‌కు ఆర్ఎస్ఎస్ నివాళి

న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆదివారం హరియాణాలో జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో దాదాపు వందమంది ప్రముఖులకు నివాళులర్పించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తి హీరా బెన్ మోదీ, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ , సోషలిస్ట్ నేత శరద్ యాదవ్ , సీనియర్ న్యాయవాది శాంతి భూషణ్ తదితరులకు నివాళులర్పించింది. గడచిన సంవత్సరంలో మరణించిన రాజకీయ నేతలు, ప్రముఖులకు శ్రద్ధాంజలి ఘటించడంతో ఈ మూడు రోజుల సమావేశాలు ప్రారంభమయ్యాయి. గత ఏడాది మరణించిన నేతలు, ప్రముఖుల పేర్లను ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే చదివి వినిపించారు. ఈ జాబితాలో సినీ నిర్మాత సతీశ్ కౌశిక్ కూడా ఉన్నారు.

ప్రతి ఎన్నిక అగ్నిపరీక్షే...

- దేశంలో బుల్లెట్లతో కాదు బ్యాలెట్లతోనే అధికార బదిలీ
- 70ఏళ్లలో 400 అసెంబ్లీ-17 లోక్‌సభ ఎన్నికల నిర్వహణ
- వివాదాస్పద ఫలితాల వెల్లడి ఈసీఐ చరిత్రలో లేదు
- సీఈసీ రాజీవ్ కుమార్

బెంగళూరు: దేశంలో బుల్లెట్లతో కాదు బ్యాలెట్లతో అధికార బదిలీ సజావుగా జరుగుతుందని ప్రధాన ఎన్నిక కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ అన్నారు. భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) అధ్వర్యంలో 400 అసెంబ్లీ ఎన్నికలు, 17 లోక్‌సభ ఎన్నికలు 70ఏళ్లలో జరిగాయని, ఎన్నడూ వివాదాస్పద ఫలితాలు వెలువడలేదని చెప్పారు. ఎన్నికల సంఘానికి ప్రతి ఎన్నిక అగ్ని పరీక్షేనన్నారు. కుమార్ బెంగళూరులో ఈ వ్యాఖ్యలు చేశారు. చాలా అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే భారత్‌లో అధికార బదిలీ సజావుగా జరుగుతుందని, బుల్లెట్లతో కాదు బ్యాలెట్లతో పనైపోతుందని కుమార్ అన్నారు. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలతో 400వ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఈసీఐ నిర్వహించిందన్నారు. దేశంలో 4,200 శాసనసభలు ఉన్నాయని, 70ఏళ్లలో ఆయా నియోజకవర్గాల్లో 400సార్లు ఎన్నికలు జరిగాయని తెలిపారు. పార్లమెంటుకు 17 సార్లు, 16సార్లు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. 70ఏళ్లలో దేశంలో సామాజిక, రాజకీయ, భౌగోళిక, భాషాపరమైన అంశాల్లో సుస్థిరత సాధించినట్లు తెలిపారు. 'మనం ఎన్నికల ఫలితాలను నమ్ముతాం కాబట్టే మన దేశం ప్రజాస్వామ్యంగా వర్ధిల్లుతోంది. ఒకదాని తర్వాత ఒకటిగా ప్రతిసారీ జరిగే ఎన్నికలతో అగ్నిపరీక్షలిస్తుంటాం' అని స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగాయని కర్ణాటక ప్రజలు నమ్ముతారా అన్న ప్రశ్నకు కుమార్ బదులిచ్చారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగాలంటే ప్రజల్లో అవగాహనతో పాటు వారి సహకారం ముఖ్యమన్నారు. తప్పు జరిగిందని తెలిస్తే సీవిజిల్ యాప్ ద్వారా ఈసీఐకి నేరుగా సమాచారం ఇవ్వాలని, ప్రతి ఫిర్యాదుకు 100 నిమిషాల్లో స్పందన లభిస్తుందని చెప్పారు. మే 24తో కర్ణాటక అసెంబ్లీ ముగియనుంది. దీంతో ఆ రాష్ట్రంలో స్వేచ్ఛగా, పారదర్శకంగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీఐ కట్టుబడి ఉందని సీఈసీ వెల్లడించారు.

ప్రతిపక్షం లేని ప్రభుత్వమా!

నాగాలాండ్‌లో ప్రజాస్వామ్యం అపహాస్యం రాజకీయ విశ్లేషకులు

కోహిమా : దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా పాలనా పగ్గాలు చేజిక్కించుకోవడమే లక్ష్యంగా రాజకీయ పార్టీల ఆలోచనలు పరాకాష్టకు చేరాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నాగాలాండ్‌లో 'ప్రతిపక్షం లేని' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. దాదాపు అన్ని పార్టీలు ఎన్‌డీపీపీ-బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చాయి. దీంతో నాగాలాండ్ 'ప్రతిపక్షం లేని' ప్రభుత్వం వైపు సాగుతోంది. అయితే ఈ ప్రభుత్వ ఏర్పాటును ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని రాష్ట్రంలోని రాజకీయ విశ్లేషకులు, వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటును ఇంకా ప్రకటించనప్పటికీ, దాని రెండవ ఇన్నింగ్స్‌ను కొనసాగించడానికి ఇతర పార్టీల నుంచి 'బేషరతు' మద్దతు పొందింది. రాజకీయ విశ్లేషకుడు జోనాస్ యంతన్ ప్రకారం, ఎన్‌డీపీపీ-బీజేపీ కలయికకు మద్దతు ఇచ్చే పార్టీలు 'తమ నాయకులను విశ్వసించే ప్రజల కోసం ఎటువంటి అజెండాను కలిగి ఉండవని, తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తుంటాయి' అని అన్నారు. 'అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యుడు లేకుండా సభలో ప్రజల ఆందోళనలను ఎవరు లేవనెత్తుతారు?' యంతన్ పీటీఐకి తెలిపారు. నాగా శాంతి చర్చలను సులభతరం చేయడానికి ప్రభుత్వానికి తాము మద్దతు ఇస్తామని పార్టీలు చేస్తున్న వాదనను 'రాజకీయ మెలోడ్రామా' అని కూడా ఆయన అన్నారు. సామాజిక కార్యకర్త నికేతు ఇరాలు మాట్లాడుతూ 'ప్రతిపక్షం లేని' ప్రభుత్వ ఆలోచనకు తాను సభ్యత్వం తీసుకోలేదని, దానిని 'అభిప్రాయం లేనిదని' అభివర్ణించారు. సీనియర్ జర్నలిస్టు, రచయిత అయిన హెచ్ చిషి పీటీఐతో మాట్లాడుతూ 'ప్రతిపక్షం లేని' ప్రభుత్వ ప్రతిపాదన 'స్వార్థ ప్రయోజనాల కోసం అధికారంలోకి రావడానికి రాజకీయ జిమ్మిక్కు' అని తెలిపారు. 'కొనసాగుతున్న శాంతి చర్చలను సులభతరం చేయడానికి 60 మంది ఎమ్మెల్యేలు (నాగాలాండ్ అసెంబ్లీ బలం) మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజల నుంచి ఉమ్మడి గొంతు ఉండాలి' అని చిషి అన్నారు. 'మనం గతంలో 'ప్రతిపక్షం లేని' ప్రభుత్వాలను కలిగి ఉన్నాము. కానీ వారు ఏమి అందించారు? ఇది అప్రజాస్వామికం. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి' అని తెలిపారు. 2015, 2021లో ప్రభుత్వ హయాంలో 'ప్రతిపక్షం లేని' ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి, అయితే సభ ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే ప్రతిపక్షాలు లేని అసెంబ్లీగా ఏర్పాటు చేయబడిన మొట్టమొదటి అసెంబ్లీ ఇదే అవుతుంది. మార్చి 2న వెలువడిన నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 60 మంది సభ్యుల సభలో ఎన్నికలకు ముందు కూటమి భాగస్వాములైన ఎన్‌డిపిపి, బిజెపి వరుసగా 25 మరియు 12 స్థానాలను గెలుచుకున్నాయి. ఎన్‌సీపీ ఏడు స్థానాలు. ఎన్‌పీపీ ఐదు, ఎల్‌జేపీ (రామ్ విలాస్), నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్), ఆర్‌పీఐ (అతవాలే) చెరో రెండు, జేడీ(యూ) ఒకటి, స్వతంత్రులు నాలుగు స్థానాలు గెలుచుకున్నారు. బీజేపీతో సరైన సంప్రదింపులు జరిపిన తర్వాతే 'ప్రతిపక్షం లేని' ప్రభుత్వ అంగీకారంపై తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి నీఫియు రియో ఇటీవల విలేకరులతో చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు టెమ్‌జెన్ ఇమ్నా అలోంగ్ మాట్లాడుతూ 'అలాంటిదేదైనా అవసరమైతే, మా ముఖ్యమంత్రి, పార్టీ కేంద్ర నాయకులు చర్చించి నిర్ణయం తీసుకోవాలి. అయితే, 'మేము మద్దతు లేఖ ఇవ్వాలని ఏ రాజకీయ పార్టీని అడగలేదు' అని అలోంగ్ చెప్పారు. ఎన్‌సీపీ లెజిస్లేచర్ పార్టీ ఉప నాయకుడు పి.లాంగోన్ పీటీఐతో మాట్లాడుతూ పార్టీ 'షరతులు లేకుండా' ప్రభుత్వానికి మద్దతు ఇస్తుందని, తుది నిర్ణయం కోసం 'ఓపికగా వేచి ఉండండి' అని అన్నారు. అదే సమయంలో ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం లేదా సభలో ప్రతిపక్ష బెంచ్ తీసుకోవడంపై పిలుపునిచ్చే ముందు దాని నాయకులు చర్చిస్తారని ఎన్‌పీపీ తెలిపింది. 'ఎన్నికల ముందు, మా ఎన్నికయిన సభ్యులు ఎన్‌డీపీపీ-బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇస్తే కనీసం ఒక క్యాబినెట్‌లో స్థానం గురించి మాకు హామీ ఇచ్చారు' అని ఎన్‌పీపీ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు నుక్లుతోషి లాంగ్‌కుమర్ తెలిపారు.

బీజేపీ నేత ప్రసంగం అడ్డుకున్న సింధియా

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ ప్రసంగించకుండా కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. దీనిపై కాంగ్రెస్ స్పందిస్తూ బీజేపీ సంప్రదాయం ఇదని విమర్శలు గుప్పించగా, ఆ ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. మాధవ్ నేషనల్ పార్క్‌కు టైగర్ల తరలింపునకు సంబంధించి శివపురి జిల్లాలో బీజేపీ ఒక కార్యక్రమం నిర్వహించింది. తన పేరు రాగానే శర్మ ప్రసంగించేందుకు మైకు వద్దకు వెళ్లారు. వేదికపైనే ఉన్న సింధియా వెంటనే ఆయన దగ్గరకు వెళ్లి మాట్లాడి ఆయనను వెనక్కి పంపిచేశారు. శర్మ తిరిగి తన సీటులో కూర్చున్న వెంటనే సింధియా మాట్లాడటం ప్రారంభించారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా వేదికపైనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో రావడంతో సింధియాపై కాంగ్రెస్ మీడియా విభాగం చైర్మన్ కేకే మిశ్రా విమర్శలు గుప్పించారు. ఇతర నేతలను వెనక్కినెట్టి, ముందుకు వెళ్లడం ఆయన (సింధియా) కుటుంబ సంప్రదాయమని వ్యాఖ్యానించారు. కాగా కాంగ్రెస్ విమర్శలపై బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి లోకేంద్ర పరాశర్ వివరణ ఇచ్చారు. చివర్లో పార్టీ అధ్యక్షుడు ప్రసంగించడం సంప్రదాయమని చెప్పారు. బీజేపీలో పార్టీ అధ్యక్షుడికి అత్యున్నత గౌరవం ఇస్తారని, చివర్లోనే ఆయన ప్రసంగం ఉంటుందని, కాంగ్రెస్‌కు ఇది అర్థం కాదని అన్నారు. పార్టీ అధ్యక్షుడికి గౌరవ సూచకంగానే ఆయన ప్రసంగం విషయంలో సింధియా జోక్యం చేసుకున్నట్టు చెప్పారు.

రేపు భోపాల్‌లో ఆప్ బహిరంగసభ

భోపాల్: ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లో పార్టీ బలోపేతానికి ఆమ్‌ఆద్మీ పార్టీ గట్టిగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ భోపాల్‌లో మంగళవారం భారీ బహిరంగసభ నిర్వహించనుంది. ఆప్ జాతీయ కార్యదర్శి, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఈ సభలో ప్రసంగించనున్నారు. ఈ సభకు లక్ష మందిని సమీకరించడానికి ఆమ్‌ఆద్మీ తీవ్రంగా కృషి చేస్తోంది. గత రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ చుట్టూ ఇప్పటివరకు కేంద్రీకృతమై ఉన్న మధ్యప్రదేశ్ రాజకీయాలలో తన ఉనికిని గట్టిగా చాటాలని ఆప్ భావిస్తోంది. 'మంగళవారం భోపాల్‌లోని బీహెచ్ఈఎల్ దసరా మైదాన్‌లో జరిగే మా ర్యాలీకి లక్ష మంది హాజరయ్యేలా కృషి చేస్తున్నాం. దీని తరువాత, మేము రాష్ట్రంలోని అన్ని డివిజనల్ హెడ్‌క్వార్టర్స్‌లో ఇంతే స్థాయిలో భారీ బహిరంగ సభలు నిర్వహించబోతున్నాము' అని మధ్యప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పంకజ్ సింగ్ పీటీఐకి చెప్పారు. ఫిబ్రవరి 4న పార్టీ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్ పార్టీ సభ్యత్వ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించినప్పటి నుంచి నాలుగు లక్షలమంది ఆప్ సభ్యత్వం తీసుకున్నారని పంకజ్ సింగ్ పేర్కొన్నారు. పంజాబ్, గుజరాత్ ఎన్నికల్లో ఆప్ వ్యూహం వెనుకున్న ముఖ్య నేతల్లో పాఠక్ ఒకరు. అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేయడంలో భాగంగా ఆయన భోపాల్, ఇండోర్, రెవా, గ్వాలియర్, జబల్పూర్‌లో పర్యటించారు. ఎంపీలో మొత్తం 230 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు ఆప్ ఇటీవల ప్రకటించింది. గత ఏడాది జులై-ఆగస్టులో జరిగి మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీ 6.3శాతం ఓట్లను సాధించింది. స్థానిక ఎన్నికల్లో ఆపార్టీ 1500 మంది అభ్యర్థులను బరిలోకి దింపగా, రాష్ట్ర వింధ్ ప్రాంతంలోని సింగ్రౌలీలో మేయర్ పదవిని గెలుచుకోగలిగింది. పార్టీలకు అతీతంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 52మంది అభ్యర్థులు విజయం సాధించగా, 135-140 మంది అభ్యర్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు పంకజ్ సింగ్ తెలిపారు.

బీహార్ ప్రభుత్వానికి ఢోకా లేదు: నితీశ్

పాట్నా: బీహార్‌లో సంకీర్ణ ప్రభుత్వ మనుగడ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాలక మహా కూటమిలో ఎలాంటి మార్పు లేదని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ బంధువులపై ఈడీ దాడులకు సంబంధించి విలేకరుల అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ... దాడులు ఎదుర్కొంటున్న వారు తగిన సమాధానాలు ఇస్తున్నారని నితీశ్ పేర్కొన్నారు. ఈడీ దాడులపై వ్యాఖ్యానించడానికి నిరాకరించిన ఆయన, ఇది రాజకీయ ప్రేరేపితమన్నారు. తాను ఆర్‌జేడీతో ఎప్పుడైతో ఉంటానో అప్పుడు దాడులు ప్రారంభమవుతుందని, వారు విషయాన్ని వివరిస్తారని నితీశ్ అన్నారు. కాగా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై తొమ్మిది ప్రతిపక్ష పార్టీలు రాసిన లేఖపై ఎందుకు సంతకం పెట్టలేదని ప్రశ్నించగా... రాజకీయ పార్టీలు విడివిడిగా పనిచేస్తాయని, తాను పరిపాలనా బాధ్యతలతో నిమగ్నమై ఉన్నానని, ఎటువంటి గందరగోళానికి తావు లేదన్నారు. విపక్షాలన్నీ ఏకమైన తర్వాత అవసరమైనప్పుడు ఆయా ప్రాంతాలను సందర్శిస్తానని కుమార్ పునరుద్ఘాటించారు. ఉపముఖ్యమంత్రి తేజస్వీ ప్రసాద్ యాదవ్ కుమార్‌పై సీబీఐ సమన్లు జారీ చేయడంపై స్పందిస్తూ...ఇందులో కొత్తేమీ లేదన్నారు.

అది రాజ్యాంగ విరుద్ధం: ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

రాయ్‌పూర్: కొన్ని ప్రభుత్వోద్యోగాలను నూటికి నూరు శాతం మహిళలకే కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు చెప్పింది. ఆ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేసిన ప్రకటనను రద్దు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరూప్ కుమార్ గోస్వామి, జస్టిస్ ఎన్‌కే వ్యాస్ ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ప్రిన్సిపాల్, ప్రొఫెసర్, డిమాన్‌స్ట్రేటర్ ఉద్యోగాలకు కేవలం మహిళలు మాత్రమే అర్హులని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పేర్కొంది. ఈ నిబంధనల ప్రకారం 91 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ఆ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2021 డిసెంబరులో ప్రకటన జారీ చేసింది. కేవలం మహిళలు మాత్రమే దరఖాస్తు చేయాలని కోరింది. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ డాక్టర్ అజయ్ త్రిపాఠీ, అల్యూస్ గ్జాల్‌క్సో, ఏకే కిస్పొట్ట, మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వోద్యోగాల్లో కేవలం మహిళలను మాత్రమే నియమించాలని నిర్ణయించడాన్ని తప్పుబట్టారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంతోపాటు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు నోటీసులిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ మహిళా కళాశాలల్లో ఉద్యోగాల కోసం కేవలం మహిళలనే ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. విద్యార్థినులకు మహిళా బోధనా సిబ్బంది ఉండాలనేదే తమ ఉద్దేశమని వివరించింది.

రక్తపుటేరులకు 30 ఏళ్లు

- 1993 ముంబై ఉగ్ర దాడుల బీభత్సం
- 100 నిమిషాలు... 12 పేలుళ్లు... 257 మంది మృతి
- 2008లో ఫిదాయీల తూటాల వర్షం
- ముష్కరులు సృష్టించిన అనేక మారణకాండలు
- అప్పటి నుంచి అప్రత్తమైన 'మహా' నగరవాసులు

ముంబై : మార్చి 1993 వరకు ముంబై (బాంబే) 24 గంటలూ 365 రోజులూ పార్టీలకు ఒక పెద్ద గమ్యస్థానంగా ఉంది. ఇది ఎప్పుడూ నిద్రపోని నగరం. అందరూ డబ్బు సంపాదించడంలో నిమగ్నమై ఉన్నట్లు అనిపించింది. పేవ్‌మెంట్ పేద నివాసితుల నుంచి కుటిల రాజకీయ నాయకులు, ఆడంబరమైన వ్యాపారవేత్తల వరకు, హర్షద్ మెహతా, అతని సహచరుల వంటి బుగ్ బుల్స్ కూడా ఆ తర్వాత వెలుగులోకి వచ్చారు. బీభత్సం అనే పదం చాలా అరుదుగా, మారుమూల సరిహద్దుల్లో జరిగేదిగా పరిగణించేవారు. దేశంలో అప్పుడప్పుడు అక్కడక్కడా పేలుళ్లు సంభవించేవి. ఈ దేశ వాణిజ్య రాజధాని అటువంటి ఘటనలకు దూరంగా ఉంది. అయితే మార్చి 12, 1993 నాటి మధ్యాహ్నం 'ఉగ్ర బీభత్సం' ఈ మహా నగరాన్ని తాకింది. దాదాపు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి ప్రారంభమై, సమన్వయంతో కూడిన 12 భారీ పేలుళ్లు నగరంలో సంభవించాయి. కేవలం 100 నిమిషాల తర్వాత, ఉగ్ర మూకల కర్కశత్వానికి ముంబై నగరమంతటా రక్తపుటేరులు పారాయి. పోలీసులు పరిశోధనలు ప్రారంభించారు. రాజకీయ నాయకులు ప్రసంగాలు చేశారు. అయితే తుదకు (అధికారికంగా) రక్తసిక్తమైన శరీరాల సంఖ్య 257గా లెక్కతేలింది. మరో 1,400 మంది గాయపడగా, మరికొంత మంది గల్లంతయినట్లు వెల్లడయింది. అయోధ్యలోని బాబ్రీ మసీదు కూల్చివేత ఫలితంగా నగరాన్ని కదిలించిన డిసెంబరు 1992-జనవరి 1993 మధ్య జరిగిన అనాగరికమైన రెండు దశల మత అల్లర్లకు ముంబై ఉగ్ర పేలుళ్లు 'ప్రతీకారం' అనే విషయం తర్వాత వెలుగులోకి వచ్చింది. ఉగ్ర మూకలు నగరానికి చెందిన భయంకరమైన మాఫియా ముఠాలు, వివిధ రకాల పోలీసులు, కస్టమ్స్ అధికారులు, గుర్తు తెలియని పాకిస్థానీలు, ఒక ప్రముఖ చలనచిత్ర నటుడు కూడా వీళ్లందరూ దేశంలోనే అత్యంత ఘోరమైన, అతిపెద్ద (ప్రాణాంతకాల పరంగా) తీవ్రవాద దాడిని నిర్వహించారు. ఈ ఉగ్రవాద బీభత్సం... విషాద ఘటనపై ఉజ్వల్ నికమ్, దీపక్ సాల్వి వంటి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో సుదీర్ఘ న్యాయ విచారణను దేశం వీక్షించింది. మజీద్ మెమన్, ఇతరులతో సహా డిఫెన్స్ తరపు అగ్రశ్రేణి న్యాయవాదులు ప్రత్యేక కోర్టులు, తరువాత బాంబే హైకోర్టు, వివిధ నిందితుల కోసం సుప్రీంకోర్టులో కూడా సవాలు చేశారు. అటు తర్వాత పరిస్థితులు సాధారమైనట్లు కనిపించడంతో, ముంబై నగరం మరోసారి నవంబరు 26, 2008న ఉగ్ర మూకల బారిన పడింది. 60 గంటలకు పైగా కొనసాగిన ఈ ఉగ్ర బీభత్సకాండలో ఈసారి 175 మంది (9 మంది ఉగ్రవాదులతో సహా) మృతి చెందారు. అయితే 15 సంవత్సరాలు గడిచినప్పటికీ, ముంబై నగరంపై ఉగ్రవాదుల దాడుల్లో స్పష్టమైన తేడాలు, సారూప్యతలు ఉన్నాయి. కొన్నేళ్లుగా వాటి మధ్య పోలికలు అనివార్యంగా మారాయి. ఉదాహరణకు, నగరం పూర్తిగా రక్షణ లేనిదిగా కనిపించినప్పుడు రెండు దాడులు జరిగాయి. ఒకటి వారాంతపు ప్రధాన శుక్రవారం మధ్యాహ్నం, మరొకటి బుధవారం సాయంత్రం... రెండూ నిశ్శబ్దంగా పేలుడు పదార్థాల అక్రమ రవాణాను, కాపలా లేని అరేబియా సముద్ర మార్గం గుండా దేశంలోకి అడ్డంకులు లేకుండా ఉగ్రవాదుల చొరబాటును చూశాయి. కాగా, 1993లో నగరం పొడవునా 12 వ్యూహాత్మక ప్రాంతాల్లో, పాక్షికంగా శివారు ప్రాంతాలలో ఉగ్రవాదులు పేలుడు పదార్థాలు పెట్టారు. కానీ 2008లో దక్షిణ ముంబైలోని ఒక చిన్న ప్రాంతంలో 10 మంది పాకిస్తానీ ఫిదాయిన్‌లు తూటాల వర్షం కురిపించేందుకు అధునాతన ఆటోమేటిక్ ఆయుధాలను ఉపయోగించారు. మొదటిది (1993) ఉగ్రవాదులు బాంబులను 12 ఎంపిక చేసిన ప్రదేశాలలో ఆర్‌డీఎక్స్‌ను నిశ్శబ్దంగా అమర్చి, తక్కువ సంఖ్యలో కొంతమంది ఉగ్రవాదులతో వాటిని పేల్చి పరారు కావడాన్ని చూసింది. అయితే 2008లో ఉగ్రవాదులు 12 లక్షిత ప్రదేశాల్లో తూటాల వర్షం లేదా గ్రెనేడ్ దాడులు, తరచుగా భారత భద్రతా సిబ్బందిపై నేరుగా కాల్పులు జరపడం ద్వారా విధ్వంసకర, రక్తపుటేరులు పారే కర్కశ చర్యలకు ఒడిగట్టారు. అయితే ముంబై మాఫియా రహస్యంగా, కానీ పాకిస్తాన్ మద్దతుతో అని ఆరోపించబడుతున్న 1993లో 100 నిడివిగల 12 ప్రాంతాల్లో బాంబు పేలుళ్లను అమలు చేసింది. 2008లో 10 మంది భారీ సాయుధులైన పాకిస్థానీ ముష్కరులు సృష్టించిన 60 నిమిషాల నరమేధానికి ముంబై మాఫియాల ద్వారా సహాయం అందినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. 1993 తర్వాత దావూద్ ఇబ్రహీం కస్కర్, ఇబ్రహీం ముస్తాక్ అబ్దుల్ రజాక్ మెమన్ అలియాస్ 'టైగర్ మెమన్', ఇతర భయానక వ్యక్తులు ఇప్పటికీ భారత చట్టాలకు దూరంగా ఉన్నారు. 2008 తర్వాత లష్కరే తొయిబాకు చెందిన ఉగ్రవాది జకీవుర్ రెహ్మాన్ లఖ్వీ పరారీలో ఉన్నాడు. భారతదేశ 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో ఉన్నాడు. రెండు ఉగ్ర దాడుల కేసులు 1993, 2008 ఆచరణాత్మకంగా ముగిశాయి. పరారీలో ఉన్న ఇతర నిందితులను ఇక్కడికి తీసుకువచ్చి విచారించినప్పుడు అవి పునరుద్ధరించబడవచ్చు. 1993 తర్వాత ముంబై నగరం మరో అరడజను దాడులను ఎదుర్కొంది. అలాగే జులై 2011లో ఒపెరా హౌస్, జవేరీ బజార్, దాదర్ వద్ద 10 నిమిషాల్లో వ్యవధిలో జరిగిన మూడు పేలుళ్లలో 26 మంది మరణించారు. 1993 పేలుళ్ల తర్వాత ఎన్.ఎన్.వోహ్రా కమిటీ నివేదికను బహిర్గతం చేయాలనే డిమాండ్‌లు వచ్చాయి. రాజకీయ లేదా అధికారుల అనుమానిత పాత్రపై కొన్ని పరిశోధనలు, వారికి సంబంధించిన అండర్‌వరల్డ్ సంబంధాలు మూటగట్టి ఉన్నాయి. అయితే 1993 తర్వాత ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా మాఫియాను వేటాడింది. 'ఎన్‌కౌంటర్ హత్యల'లో వందలాది మంది గ్యాంగ్‌స్టర్లను తుదముట్టించింది. 2008 తర్వాత ముంబై చాలా అప్రమత్తంగా మారింది. ప్రజలు అప్రమత్తంగా, అవగాహనతో ఉన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులను ఎదుర్కోవడానికి పోలీసులు, భద్రతా సంస్థలు మెరుగ్గా సన్నద్ధమయ్యాయి. అయినప్పటికీ, మార్చి 12, 1993 తర్వాత పూర్తి 30 సంవత్సరాల తర్వాత బాంబు దాడులను చూసిన లేదా ప్రాణాలతో బయటపడిన చాలా మంది ఇప్పటికీ వణుకుతున్నారు.

తగ్గుతున్న మహిళా కార్మికశక్తి

- పనికి తగ్గ వేతనం ఏది?
- సముచిత ఉపాధి అవకాశాలు కరువు
- పురుషులతో పోల్చితే జీతాల్లో 20-50 శాతం వ్యత్యాసం
- పీఎల్ఎఫ్ఎస్ తాజా నివేదికలో వెల్లడి

న్యూదిల్లీ: దేశంలో గత మూడేళ్లలో మహిళా కార్మికశక్తి బాగా తగ్గింది. నిరుద్యోగం పెరిగింది. ఉద్యోగావకాశాలు సన్నగిల్లాయి. దీంతో పని దొరికే పరిస్థితి లేదు. ప్రభుత్వాలు కూడా ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయి. ఓటర్లుగా మహిళలకు గుర్తింపు ఉన్నాగానీ వారికి ఉద్యోగావకాశాలు సముచితంగా లేవు. వ్యవసాయ రంగంలో మాత్రమే మహిళా కార్మికులు ఎక్కువగా ఉన్నారు. అయితే వారికి సమాన పనికి సమాన వేతనం మహిళలకు లభించడం లేదు. పురుషులు చేసే పనినే తక్కువ జీతానికి మహిళలు చేయాల్సి వస్తోంది. వీరి వేతనాల్లో తేడా 20 శాతం నుంచి 50శాతం వరకు ఉన్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. పనికి తగ్గ వేతనం పొందే పరిస్థితులు మహిళలకు ఉండటం లేదు. అలాంటి మహిళల సంఖ్య దేశంలో కనిష్ఠంగా ఉంది. ఈ మేరకు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) 2021-22 నివేదిక పేర్కొంది. గణాంకాల మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) ఈ నివేదికను రూపొందించింది.

రోజువారీ కూలీలైన పురుషులకు, మహిళలకు మధ్య వేతన వ్యత్యాసం 35శాతంగా (గ్రామాల్లో), పట్టణాల్లో 21శాతంగా ఉంది. క్యాజువల్ కార్మికులలైతే గ్రామాల్లో 33శాతం, పట్టణాల్లో 31శాతంగా వేతన వ్యత్యాసం ఉంది. మట్టి మోయడం, తవ్వడం వంటివి ఇద్దరూ చేస్తారుగానీ సమాన వేతనం ఉండదు. స్వీయ ఉపాధి పొందే వారి విషయానికొస్తే వేతన వ్యత్యాసం మరీఎక్కువ. పురుషులు, మహిళల వేతనాల్లో గ్రామాల్లో 58శాతం, పట్టణాల్లో 59 శాతం మేర తేడా ఉంది. స్వీయ ఉపాధి మహిళ గ్రామాల్లో రూ.5వేలు, పట్టణాల్లో రూ.7,600 వరకు పొందగలరు. స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) సాయంతో ఎంటర్‌ప్రైజెస్ నడిపే మహిళల పరిస్థితి కూడా అంతే. అయితే గామాల్లో 57 మంది మంది పురుషులు పనిచేస్తే మహిళా కార్మికులుగా 27శాతం మంది మాత్రమే ఉన్నారు. అలాగే పట్టణాల్లో 58 శాతం మంది పురుషులు, 19శాతం మంది మహిళలు పని చేస్తున్నారు. ఈ లెక్కన సగటున 57శాతం కార్మికులు పురుషులు కాగా 25శాతం మహిళలు ఉన్నారని నివేదిక పేర్కొంది.

గ్రామాల్లో 51శాతం మంది పురుషులు, 76శాతం మహిళలు ఉపాధి కోసం వ్యవసాయాన్నే నమ్ముకున్నారు. నిర్మాణ రంగంలో పనిచేసే పురుషులు 17శాతం కాగా వ్యాపారాలు, హోటళ్లలో పనివారుగా 11శాతం, ఉత్పత్తి రంగంలో ఎనిమిది శాతంగా పురుషులే ఉన్నారు. ఉత్పత్తి రంగంలో మహిళలు ఎనిమిది శాతంగా, నిర్మాణ రంగంలో ఆరు శాతంగా మాత్రమే ఉన్నారు. పట్టాణాల్లో 41శాతం మంది మహిళలు అడ్మినిస్ట్రేషన్, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో సేవలు అందిస్తున్నారు. టీచర్లుగా, ఆరోగ్య సంరక్షణ కార్మికులుగా, ఇంటి పనివారిగా ఉన్నారు. పట్టణాల్లో ఉత్పత్తి రంగం (టెక్స్టైల్)లో పనిచేసే మహిళలు 24 శాతంగా ఉంటే హోటళ్లు/రెస్టారెంట్లలో ఉద్యోగులుగా 15 శాతం, నిర్మాణ రంగంలో ఐదు శాతం మంది ఉన్నారు. అసంఘటిత రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలకు వేతనాలు లభించవు. వారు ఒప్పంద ఉద్యోగులుగా, తక్కువ వేతనాలకు పనిచేసేవారిగానే ఉంటారు. మూడు దశాబ్దాల కిందట పరిస్థితులతో పోల్చితే నేటి మహిళలకు అవగాహన, చదువు చదువు ఉంది కాబట్టి సమాజంలో సమాన తోడ్పాటు అందించే పౌరులవ్వాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

జీవో-1 రద్దు పోరుకు మద్దతు

- 15, 16 తేదీల్లో జరిగే పోరాట సమితి జిల్లా స్థాయి సమావేశాలకు సంఘీభావం
- 20న అసెంబ్లీ ముట్టడి జయప్రదం చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బ్రిటీష్ కాలం నాటి చట్టాలతో అప్రజాస్వామికంగా ఉత్తర్వులివ్వడం, జీవోలు తేవడం జగన్ నియంతృత్వ పాలనకు నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. జీవో నంబరు-1ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 15, 16 తేదీల్లో జీవో నం-1 రద్దు పోరాట ఐక్యవేదిక చేపట్టనున్న సమావేశాలకు సంఘీభావం తెలిపారు. ఈనెల 20న అసెంబ్లీ ముట్టడి జయప్రదానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ అధికారం చేపట్టాక ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలతో నియంతలా వ్యవహరిస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. ప్రజాస్వామిక హక్కులపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఈ జీవోను ఉపసంహరించాలన్నారు. పోలీస్ చట్టం-1861లోని మూడవ సెక్షన్ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ర్యాలీలు, రోడ్‌షోలు, సభలు, సమావేశాలు జరపకుండా చీకటి జీవోను రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. కందుకూరు, గుంటూరులో జరిగిన ఘటనల నెపంతో జీవో తేవడం విపక్షాలు, ప్రజాసంఘాలు ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు చేయకుండా అడ్డుకోవాలనే జగన్ దుష్టఆలోచనకు తార్కాణమన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో సభల నిర్వహణకు అనుమతిస్తామన్నారుగానీ అలాంటి పరిస్థితులు వైసీపీ వర్గాలకు మాత్రమేనా? అని రామకృష్ణ ప్రశ్నించారు.

మంత్రి ఉషశ్రీ చరణ్‌ను బర్తరఫ్ చేయాలి

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్న రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీ చరణ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉపాధ్యాయులు, పట్టభద్రులకు జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల క్రమంలో ఓటర్లకు డబ్బు పంచాలని ఓ మంత్రి చెప్పడం రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. జగన్ ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారాన్ని దుర్వినియోగిస్తోందని, అక్రమాలకు, బెదిరింపులకు, ఓట్ల కొనుగోలుకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం కల్పించాల్సిన మంత్రులే సంతలో పశువుల్లా విద్యావంతుల్ని కొనుగోలు చేయాలనుకోవడం విచారకరమన్నారు. మంత్రి ఉషశ్రీ చరణ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్లకు జగన్ క్షమాపణ చెప్పాలన్నారు. విజ్ఞులు, విద్యావంతులు, వివేకవంతులైన ఓటర్లు వైసీపీ కుటిల యత్నాలను తిప్పికొట్టాలని, ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

ఏ పార్టీ జెండా... అజెండాల కోసం జనసేన పనిచేయదు

- కాపులు, బీసీలు, దళితులను కలుపుకుని వెళితేనే రాజ్యాధికారం
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: జనసేన పార్టీ ఏ రాజకీయ పార్టీ జెండా, అజెండాల కోసం పని చేయదని జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీ కోసం పనిచేసిన ఏ ఒక్కరి ఆత్మగౌరవానికి భంగం వాటిల్లనివ్వనని, వాస్తవిక ధోరణితో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటాను తప్ప... అవమానపడి, గింజుకొని ఎవరితోనే ఎందుకుంటానని తెలిపారు. నచ్చకపోతే నచ్చలేదని నిర్మోహమాటంగా చెప్పేస్తాను తప్ప. లోపాయికారి ఒప్పందాలు పెట్టుకోనని చెప్పారు. ఈ మధ్య వెయ్యి కోట్లు... వెయ్యి కోట్లు అని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, డబ్బుతో ఎవరూ రాజకీయ పార్టీని నడపలేరని అన్నారు. జనసేన పార్టీ భావజాలంతో నడుస్తుందన్నారు. కాపులు పెద్దన్న పాత్ర పోషించి దళితులు, బీసీలను కలుపుకొని వెళ్లగలిగితే రాజ్యాధికారం సిద్ధిస్తుందని, లేనిపక్షంలో ఎన్నటికీ రాజకీయ సాధికారత సాధ్యం కాదని అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి పార్టీ కార్యాలయంలో కాపు సంక్షేమ సేన నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సంఖ్యా బలం ఎక్కువ ఉండి కూడా రాజ్యాధికారం చేజిక్కించుకోలేని కులాల్లో కాపు, తెలగ, బలిజ, ఒంటరి సమూహాలు చాలా కీలకమైనవి. ఇప్పటికి కూడా మాకు రిజర్వేషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వండి అని చేయి చాచడం బాధాకరం. ఇంత సంఖ్యాబలం సంఖ్యా బలం ఉన్న కాపులు అధికారంలోకి రాగానే బీసీలు, దళితులను ఎదగనివ్వరనే విష ప్రచారం బయట జరుగుతోంది. దానిని బలంగా తిప్పికొట్టాలి. రామ్ మనోహర్ లోహియా 'క్యాస్ట్ ఇన్ ఇండియా' అనే పుస్తకంలో బీసీలు, దళితులు, కాపులు కలిస్తే రాజ్యాధికారం ఇంక ఎవరికీ దక్కదని రాశారు. రామ్ మనోహర్ లోహియా కలను జనసేన సాకారం చేస్తుంది. కాపులు, బీసీలు, దళితులు ఎదగడం అంటే మిగతా కులాలను తగ్గించడం కాదు. సీఎం కుటుంబం గనుల ఆస్తులు బలిజ కుటుంబానివే. ముఖ్యమంత్రి కుటుంబం ఆ రోజు పెట్టిన హింసను తట్టుకోలేక వాటిని వదిలి పెట్టేశారు. నిజంగా కాపులు నాకే ఓటు వేసి ఉంటే భీమవరం, గాజువాక రెండు చోట్ల గెలిచేవాడిని. సమాజంలో మార్పు తీసుకురావాలని పోరాటం చేస్తాను. 2024 సార్వత్రిక ఎన్నికలు చాలా కీలకం. హరిరామ జోగయ్య సూచించిన అంశాలను పరిశీలిస్తాము. అందరితో చర్చించి జనసేన మ్యానిఫెస్టోలో పొందుపరుస్తామని పవన్ కల్యాణ్ అన్నారు.

కారు టైరు పేలడం మానవ నిర్లక్ష్యమే

బీమా సంస్థ పరిహారం చెల్లించాల్సిందే: బాంబే హైకోర్టు

ముంబై: వాహనం టైరు పేలడం యాక్ట్ ఆఫ్ గాడ్ కాదని...అది మానవ నిర్లక్ష్యమే నని బాంబే హైకోర్టు స్పష్టంచేసింది. బాధిత కుటుంబానికి బీమా సంస్థ పరిహారం అందించాలని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. కారు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం విపత్తు కిందకే వస్తుందని, అందుకు పరిహారం చెల్లించేందుకు నిరాకరిస్తూ ఓ బీమా సంస్థ చేసిన అప్పీలును బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. ముంబైకి చెందిన పట్వర్ధన్ (38).. తన స్నేహితులతో కలిసి 2010లో పూనె నుంచి ముంబైకి కారులో వెళ్తున్నారు. కారు యజమాని పట్వర్ధన్ స్నేహితుడు వాహనాన్ని అతివేగంగా నడిపించారు. దాంతో టైరు పేలి కారు ప్రమాదానికి గురయింది. ఆ ఘటనలో పట్వర్ధన్ అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఈ కేసు విచారించిన వాహన ప్రమాదం క్లెయిమ్‌ల ట్రిబ్యునల్.. పట్వర్ధన్ కుటుంబానికి రూ.1.25 కోట్ల పరిహారం అందించాలని న్యూ ఇండియా అస్యూరెన్స్ బీమా కంపెనీని 2016లో ఆదేశించింది. అతడి కుటుంబానికి అతనొక్కడే ఆర్థిక ఆధారమని వ్యాఖ్యానించింది. అయితే, ఆ పరిహారం చాలా అధికంగా ఉందని పేర్కొంటూ ట్రిబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ బీమా సంస్థ బాంబే హైకోర్టులో అప్పీలు చేసింది. వాహన టైరు పేలడం అనేది విపత్తు కిందకు వస్తుందని బీమా సంస్థ వాదనలు వినిపించింది. వాదనలు విన్న జస్టిస్ ఎస్‌డీ డిగే ఏకసభ్య ధర్మాసనం... బీమా సంస్థతో ఏకీభవించేం దుకు నిరాకరించింది. టైరు పేలడం అనేది విపత్తు కిందకు రాదని... అది నియంత్రించగలిగే చర్యేనని స్పష్టం చేసింది. అతివేగం, టైరులో గాలి హెచ్చుతగ్గులు లేదా సెకండ్ హ్యాండ్ టైర్, ఉష్ణోగ్రత వంటివి టైరు పేలడానికి కారణాలై ఉండవచ్చని పేర్కొంది. అందుకే ఇది మానవ తప్పిదం కిందకే వస్తుందని స్పష్టం చేస్తూ ట్రిబ్యునల్ తీర్పును సమర్థించింది.

సింగర్ కీర్తిదన్ గద్విపై ఫిదా

నోట్లు కురిపించిన అభిమానులు

వల్సాడ్: గుజరాత్ జానపద గాయకుడు కీర్తిదన్ గద్వి గానానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు ఆయనపై నోట్ల నోట్ల వర్షం కురిపించారు. కరెన్సీ నోట్లను పూలలా చల్లుతూ అభిమానం చాటుకున్నారు. గుజరాత్‌లోని వల్సాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అంతకుముందు అహ్మదాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలోనూ కీర్తిదన్ పాటకు ఫిదా అయి లక్షల రూపాయలు ఆయనపై వెదజల్లారు.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

న్యూదిల్లీ: దేశంలో కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. 24 గంటల్లో 524 ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి. 113 రోజుల తర్వాత కేసుల్లో పెరుగుదల కనిపించిందని, తాజా కేసులతో కలిపి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,619కి చేరిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. మృతుల సంఖ్య 5,30,781కి చేరినట్టు పేర్కొంది. కోవిడ్ కేసుల సంఖ్య 4.46 కోట్లుగా ఉందని, రికవరీ రేటు 98.80గా, మరణాల రేటు 1.19 శాతంగా ఉందని తెలిపింది. 220.64కోట్ల వాక్సిన్‌లు ఇచ్చినట్టు పేర్కొంది.

'రానా నాయుడు' ఒంటరిగానే చూడండి: రానా

హైదరాబాద్: బాబాయ్ వెంకటేశ్.. అబ్బాయ్ రానా కలిసి నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. క్రైమ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ లో ప్రసారమవుతోంది. అయితే 'రానా నాయుడు' గురించి ఎంత మంచి టాక్ వస్తోందో... అంతే నెగటివ్ ఫీడ్ బ్యాక్ కూడా వస్తోంది. అశ్లీలత ఎక్కువగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్విట్టర్‌లో వచ్చే కామెంట్లపై రానా దగ్గుబాటి స్పందిస్తున్నారు. 'రానా నాయుడు సిరీస్‌ను విమర్శిస్తున్న, అసహ్యించుకుంటున్న వారికి క్షమాపణలు చెబుతున్నాను... ఇదే సమయంలో తమ సిరీస్‌కు ఇంతటి ఆదరణ అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని అన్నారు. ఆదివారం ఉదయం నుంచి ఆయన అనేక ట్వీట్లు చేశారు. ఈ వెబ్ సిరీస్‌ను కుటుంబంతో కలిసి చూడొద్దని ఆయన కోరారు. 'ఏ' రేటెడ్ సినిమా అని, 18 ప్లస్ వయసు వారికేనని పేర్కొన్నారు. ఒంటరిగానే చూడాలని ఆయన కోరడం గమనార్హం. నిజానికి స్ట్రీమింగ్‌కు ముందే ఈ సిరీస్ ఎలా ఉండబోతోందో హింట్ ఇచ్చారు వెంకటేశ్. ప్రీమియర్ షో సందర్భంగా మాట్లాడిన ఆయన.. 'మీ ఇంట్లో ల్యాప్ ట్యాప్‌లు, ఫోన్లలో దీన్ని చూస్తుంటే మీ ఫేస్‌లో ఎక్స్‌ప్రెషన్లు పూర్తిగా మారిపోతుంటాయి. ఎందుకంటే ఇందులో కామెడీ, హింస, సెక్స్ కూడా ఉన్నాయి' అని చెప్పారు. 'కానీ మరీ ఇంతనా?' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మితిమీరిన అసభ్య పదజాలం, శృంగార సన్నివేశాలు ఉన్నాయని విమర్శిస్తున్నారు.

మాధురీ దీక్షిత్‌కు మాతృ వియోగం

ముంబై: బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ మాధురీ దీక్షిత్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. మాధురీ తల్లి స్నేహలత దీక్షిత్(91) ఆదివారం ఉదయం కన్నుమూశారు. వయోభారం కారణంగా ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం ముంబైలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. స్నేహలత మరణం పట్ల అనేకమంది బాలీవుడ్ సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. తల్లి మరణంపై మాధురీ దీక్షిత్ ఎమోషనల్ అయింది. 'ఆమె ప్రశాంతంగా తనకు ఇష్టమైన వారి మధ్య, వారిని చూస్తూ స్వర్గానికి పయనమైంది' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. కాగా గత ఏడాది మాధురీ తన తల్లి స్నేహలత బర్త్‌డేకు కూడా ఎమోషనల్ ట్వీట్ చేసింది. 'హ్యాపీ బర్త్ డే అమ్మా.. కూతురికి అమ్మే మంచి ఫ్రెండ్ అని అంటుంటారు.. అది నిజమే కదా? నువ్ నాకోసం చేసినవన్నీ, నాకు నేర్పిన బుద్ధులన్నీ కూడా నాకు బహుమతులే. నువ్ ఎప్పుడూ ఆరోగ్యాలతో ఉండాలి' అంటూ పోస్ట్ చేసింది.



హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ ఇంటర్‌జోన్ పోటీలు

విశాలాంధ్ర-రాప్తాడు: అనంతపురం ఆర్డీటీ మైదానంలో రెండోరోజు సీనియర్ ఆల్ ఇండియా ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ సాఫ్ట్‌బాల్ ఇంటర్ జోన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల ప్రారంభానికి ముఖ్య అతిథులుగా సాఫ్ట్‌బాల్ ఇండియా అసోసియేషన్ సీఈఓ ప్రవీణ్ అనౌకర్, ట్రెజరర్ శ్రీకాంత్ తోరాట్, అనంతపురం డీఎస్పీఏ, టోర్నమెంట్ అబ్జర్వర్ రమణ, అసోసియేషన్ ఏపీ సీఈఓ వెంకటేశులు, తెలంగాణ సెక్రటరీ శోభన్, ఏపీ కార్యదర్శి నాగేంద్ర, హరియాణా, పంజాబ్ ప్రతినిధులు షబ్బీర్ సింగ్, జుగుల్ కిషోర్, పీడీ కేశవమూర్తి హాజరయ్యారు. ఆదివారం జరిగిన పోటీల్లో పురుషుల సౌత్ జోన్ జట్టు ప్రథమ స్థానం, వెస్ట్ జోన్ జట్టు ద్వితీయ స్థానం, నార్త్ జోన్ జట్టు తృతీయ స్థానం, ఈస్ట్ జోన్ జట్టు నాల్గవ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో జరిగిన పోటీల్లో సౌత్ జోన్ ప్రథమ స్థానం దక్కించుకుంది. నార్త్ జోన్ ద్వితీయ స్థానం, వెస్ట్ జోన్ తృతీయ స్థానం, ఈస్ట్ జోన్ నాలుగవ స్థానం సాధించాయి. సోమవారం ఫైనల్ పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు ప్రభాకర్, గోపాల్ రెడ్డి లతాదేవి, ప్రసాద్, రమేష్, సత్యనారాయణ, సీనియర్ క్రీడాకారులు బద్రి, సాయి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులకు ఏం కావాలో రాజమౌళికి తెలుసు



హైదరాబాద్: లాస్ ఏంజెల్స్‌లోని డాల్బి థియేటర్‌లో ఆస్కార్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ హీరోలు రాంచరణ్, జూనియర్ ఎన్టీఆర్, ఎస్ఎస్ రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డ అండ్ టీం వేడుకలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆర్ఆర్ఆర్ టీం ఈవెంట్ షురూ అయ్యే కంటే ముందే ఏదో ఒక అప్‌డేట్స్ ఇస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నారు. తాజాగా ఎన్టీఆర్ ఓ హాలీవుడ్ చానల్‌తో మాట్లాడారు. నాటు నాటు పాట కోసం తాము పడిన కష్టం గురించి, రాజమౌళి పర్ఫెక్షన్ గురించిన ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. నాటు నాటు పాటకు తాను, రామ్ చరణ్ చేసిన డ్యాన్స్ కంటే... ఇద్దరం ఒకే సింక్‌లో చేయడం కష్టంగా అనిపించిందని ఎన్టీఆర్ చెప్పారు. ఆ పాట కోసం తాము రోజూ 3 గంటలు ప్రాక్టీస్ చేసే వాళ్లమని తెలిపారు. షూటింగ్‌కు ముందు, షూటింగ్ జరిగేటప్పుడు కూడా రిహార్సల్స్ చేస్తూనే ఉండే వాళ్లమని చెప్పారు. 'ఆ పాట షూటింగ్ సమయంలో రాజమౌళి.. మా ఇద్దరి మూమెంట్ ఒకేలా ఉండాలని ఎన్నో టేకులు తీసుకున్నారు. ప్రేక్షకులు ఇంత గమనిస్తారా? అని అప్పుడు అనుకున్నా. కానీ పాట విడుదల అయ్యాక ప్రతి ఒక్కరూ మా ఇద్దరి డ్యాన్స్ సింక్ గురించి మాట్లాడుకున్నారు. ప్రేక్షకులకు ఏం కావాలో రాజమౌళికి తెలుసని అప్పుడు అర్థమైంది' అని ఎన్టీఆర్ ప్రశంసలు కురిపించారు. ఆర్ఆర్ఆర్.. పూర్తిగా స్నేహానికి సంబంధించిన సినిమా అని ఎన్టీఆర్ చెప్పారు. సినీ రంగంలోనే పెద్ద పండుగగా భావించే ప్రతిష్ఠాత్మక ఆస్కార్‌లో తమ సినిమా భాగమైందని, ఒక నటుడిగా ఇంతకుమించి తానేం ఆశించగలనని అన్నారు. ఆస్కార్ వేడుకల కోసం తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని చెప్పారు. ఓ భారతీయుడిగా ఈ వేడుకకు హాజరవుతానని తెలిపారు.

కోహ్లీ సెంచరీ...రాణించిన అక్షర్

భారత్‌కు 91 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

అహ్మదాబాద్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఇక్కడ జరుగుతున్న నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా భారీ స్కోరు సాధించింది. శుభమన్ గిల్ అద్భుత సెంచరీ(128)కి తోడు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో 480 పరుగులు చేసిన ఆస్ట్రేలియాకు దీటుగా బదులిస్తూ 571 పరుగులు చేసింది. ఫలితంగా 91 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 289/3తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా... 309 పరుగుల వద్ద రవీంద్ర జడేజా (28) రూపంలో నాలుగో వికెట్ కోల్పోయింది. మరోవైపు క్రీజులో పాతుకుపోయిన మాజీ సారథి కోహ్లీ, శ్రీకర్ భరత్ (44), అక్షర్ పటేల్‌తో కలిసి మంచి భాగస్వామ్యాలు నమోదు చేశాడు. ఈ క్రమంలో కోహ్లీ మూడు సంవత్సరాల 3 నెలల తర్వాత టెస్టుల్లో సెంచరీ సాధించి పరుగుల దాహాన్ని తీర్చుకున్నాడు. టెస్టుల్లో కోహ్లీకి ఇది 28వ సెంచరీ. మరోపక్క జోరుగా ఆడుతూ సెంచరీకి చేరువైన అక్షర్ పటేల్‌ను స్టార్క్ బౌల్డ్ చేశాడు. 113 బంతులు ఆడిన అక్షర్ పటేల్... 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 79 పరుగులు చేశాడు. అక్షర్ అవుట్ తర్వాత చివరి వరుస బ్యాటర్లు బంతిపై ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. వచ్చినవారు వచ్చినట్టు వెనుదిరిగారు. ఇంకోవైపు, ద్విశతకానికి చేరువైన కోహ్లీ ఆ మైలురాయిని కూడా చేరుకుంటాడని అభిమానులు ఆశించారు. అయితే 185 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం తప్పించుకున్న కోహ్లీ మరో పరుగు తర్వాత వికెట్ సమర్పించుకున్నాడు. మర్ఫీ ఓవర్‌లో అతను గాల్లోకి లేపిన బంతిని లబుషేన్ ఒడిసి పట్టుకున్నాడు. మొత్తంగా 364 బంతులు ఎదుర్కొన్న కోహ్లీ 15 ఫోర్లతో 186 పరుగులు చేశాడు.

9వ వికెట్‌గా వెనుదిరిగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 3 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో నాథన్ లియాన్ , టాడ్ మర్ఫీ మూడేసి వికెట్లు తీశారు. స్టార్క్ రెండు వికెట్లు, కునేమాన్ ఒక వికెట్ పడగొట్టారు. ఆటకు రేపు చివరి రోజు. పిచ్ బ్యాటర్లకు అనుకూలిస్తున్న నేపథ్యంలో ఏదైనా అద్భుతం జరిగితే తప్ప టెస్టు డ్రా అయ్యే అవకాశాలే కనిపిస్తున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.